# ధర్మాచరణే మన కర్తవ్యం

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

నీటిలో ప్రయాణం చేయదలచినవాడు నీటితత్త్వాన్ని తెలుసుకొని, దానికి తగిన పదార్థంతో తయారుచేసిన నౌకలో ప్రయాణం చేయాలి. ప్రయాణం చేయడానికిగూడ ప్రవాహానికి వాలుగా, అడ్డంగా, ఎదురుగా పయనించడంలో గల కష్టసుఖాలు, మెలుకువలూ తెలుసుకోవాలి. అలానే సృష్టికాధారమైన దివ్య సూత్రాల నర్థంచేసుకొని జీవించడమే ధర్మార్థ కామమోక్షాలనే నాలుగు పురుషార్థాలకూ మూలం.

ప్రకృతిలో మనకు గోచరించే సూత్రాలలో ఒకటి: ప్రతిజీవి మిగిలిన ప్రకృతికేదో ఒక విధంగా మేలుచేస్తూ, ఆ ప్రక్రియలో తన జీవనాన్ని సాగించుకొంటుంది. దాని జీవనము, మిగిలిన ప్రకృతికి దానివలన జరిగే సహకారము విడివడని విధంగా పెనవేసుకొని వుంటాయి. అంటే దూరంగా ఆలోచిస్తే సర్వ శ్రేయస్సుకోసం కృషిచేయడం ద్వారా సమిష్టి శ్రేయస్సులో భాగంగానే తన శ్రేయస్సును జీవి పొందడమే దైవ నిర్మితమైన ధర్మముదానినే మన ఋషులు 'శ్రేయస్సు' అన్నారు. అలాగాక సాటి జీవుల శ్రేయస్సుకు కించిత్తుగూడ సంబంధించకనే వ్యక్తి తన శ్రేయస్సును కోరుకోడాన్నే 'ప్రేయస్సు' అన్నారు. ఇదే మమకారము, రాగద్వేష, అసూయాది భావాలకు ఆధారం. కర్మ చక్రంలో జీవులను శాశ్వతంగా బంధించేది యిదే.

ఇతర ప్రాణులన్నీ యిట్టి ధర్మ సూత్రాన్ని అనాలోచితంగానే సహజ ప్రవృత్తిగానే అనుసరిస్తాయి. వాటికి లేని మనో వికాసము, యోచన మనిషికి వున్నాయి. కనుకనే ప్రకృతిలోని యితర జీవులన్నీ ఎవ్వరూ నేర్పకనే తమ జీవన కార్యాలను – చేప యీదడం, పక్షులు గూళ్ళు కట్టడం నుంచి – సక్రమంగా చేయగల్గుతాయి. కాని మనిషి అలా గాదు. నడక, మాట దగ్గరనుండీ అన్ని కార్యాలనూ చిరకాలాభ్యాసంచేత యితరులను చూచి నేర్చుకోవలసినదే. అలానే పైన ప్రస్తావించిన సృష్టి ధర్మాన్నిగూడ మనిషి యోచనతో గ్రహించి, దాని సొంపును ప్రీతితో ఆనందించి హృదయపూర్వకంగా అనుసరించాలి. అలా చేయ నేర్పడమే మానవ వికాసంలోని సారం. సామాజిక, నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విలువలన్నీ అందులోని అంతర్భాగాలే.

ఇటువంటి పరిజ్ఞానమే వివేకము, సాత్త్విక జ్ఞానము, కర్మలకు మూలం. అట్టి కర్మాచరణే భగవదర్పిత బుద్ధితో చేయబడే నిష్కామ కర్మయోగం, అదే ధర్మం. దాని పర్యవసానమే పూర్ణమైన జ్ఞానము. యజ్ఞ, దాన, తపః కర్మలు అని ఋషులచేత చెప్పబడిన మానవ కర్తవ్యం దీనియొక్క రూపమే. అదే దైవీసంపద. సత్వగుణం. ఈ మూడింటినీ విడచిన ఆధ్యాత్మిక శ్రేయస్సన్నది లేనేలేదని సాధకులు, ముముక్షువులు గుర్తించాలి. ఈ దివ్య జీవనసూత్రాన్ని గుర్తించి, అనుసరించి చిత్తశుద్ధిని, సత్వశుద్ధినీ పొందనిదే జ్ఞానబోధ జరిగినా ఫలించదని ఋషివాక్యం.

ఇది తెలియని ఎందరో సాటిజీవుల శ్రేయస్సును పట్టించుకొనక భార్యాబిడ్డలనూ, సాటివారినీ గాలికి విడచి తామొక మూలకూర్చుని ముక్కు మూసుకొని తరించవచ్చని భ్రమిస్తారు. అలాటి వారికొరకే భగవద్గీత దైవీగుణ సంపన్నులైన సాత్వికుల యజ్ఞ దాన తపః కర్మలు మాత్రమే సఫలమవుతాయని, అలా చెప్పిన శాస్త్ర విధిననుసరించక విడచిన వాడెవ్వడూ ఎన్నటికీ సిద్ధిని పొందడని ఘంటా పథంగా చెబుతుంది. శాస్త్రవిధిని అవగాహనతోనే పాటించాలని ధర్మ శాస్త్రాలు చెబుతున్నాయి. అటువంటి సరియైన అవగాహన పొంది మనము నేర్చిన దానిని సాటివారితో పంచుకుని పై చెప్పిన జీవన సూత్రాలననుసరించి ధన్యత నొందటమే మన కర్తవ్యం.

---

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

SRI MANGA BHARDWAJA TRUST

చీఫ్ ఎడిటర్: **శ్రీ పోలూరి శ్రీనివాసరావు** బి.ఎ.ఎల్.ఎల్.బి

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్: **డా॥ ఆర్.ఎస్. శశిధర్,** పిహెచ్. డి

**సంపుటి: 28** **మే 2010** **సంచిక: 1**

ఒకరి నుండి ఒకరు వేరు అన్న భావం బలపడడానికి ఆధునిక జీవితంలో ఒక కుటుంబంతో ఒక కుటుంబానికి ఎట్టి సంబంధాలు లేకుండా బ్రతకడం ఒక పెద్ద కారణం. అలా కాక భక్తుల కుటుంబాలన్నీ వారానికో పక్షానికో ఒకచోట సమావేశం కావడం, కలిసి వేడుకలు, పూజాదికాలు చేసుకోవడం దీనికెంతో ఉపకరిస్తుంది. సహజ మానవ ప్రవృత్తి ననుసరించి కీచులాటలు, పోటీలు, భేదాలు వస్తేరావచ్చు. అందుకు కారణం అంతస్తులు, కులమత భేదాలు, ఆడంబరాలు అనే దౌర్భాగ్యపు అడ్డుగోడలు హృదయాలను సంకుచితం చేయడమే. కలవారినే గౌరవించడం, లేనివారిని చిన్న చూపు చూడడంవంటి హీన వికార చేష్టలను నేటి సమాజం నూరిపోస్తోంది. వాటిలో చిక్కిన హృదయాలకు పూజలు, జపాలూ ఏమీ ఉపకరించవు. కారణం వాటి ప్రయోజనం హృదయాలను అట్టి భ్రాంతుల నుండి క్షాళన చేయడమే.

**- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ**

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు. శ్రీ మంగభరద్వాజ ట్రస్టుకు ఎటువంటి బాధ్యతా లేదు.

## విషయసూచిక

1. ధర్మాచరణే మన కర్తవ్యం 01
2. బుద్ధపూర్ణిమ ప్రాశస్త్యం ఏమిటి? 03
3. మానవాళికి అందిన మహిత వరం సాయిబాబా 06
4. శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి 08
5. శ్రీ సాయి సచ్చరిత్ర 11
6. శ్రీ దత్తలీలామృతం –సీరియల్ 13
7. వార్తాలాపము – సీరియల్ 17
8. శ్రీ భరద్వాజ లేఖామృతము 22
9. శ్రీ మంగభరద్వాజ ట్రస్ట్ 24
12. సాష్టాంగప్రణామములు 25
13. శ్రీ సాయిబాబా జన్మ రహస్యం 28

**చందా వివరములు**

| | |
|---|---|
| విడిప్రతి | : రూ. 10–00 |
| సంవత్సర చందా | : రూ. 100–00 |
| జీవిత చందా | : రూ. 1,116–00 |

(సం॥లోపల 5 తేలిక వాయిదాలలో చెల్లించవచ్చును)
(20 సం॥లపాటు మీకు పత్రిక పంపబడుతుంది)

| | |
|---|---|
| రాజపోషకులు | : రూ. 3,000–00 |
| మహారాజపోషకులు | : రూ. 5,000–00 |

**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P,Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500 068
website: www.saibharadwaja.org

# బుద్ధపూర్ణిమ ప్రాశస్త్యం ఏమిటి?

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

మే నెలలో వచ్చే బుద్ధ పూర్ణిమకొక విశిష్టతున్నది. అది మానవజాతి చరిత్రలోనే ఒక మైలురాయి అని చెప్ప వచ్చు. భౌతికశాస్త్ర చరిత్రలో గత 2 శతాబ్దాలలో న్యూటన్, ఐన్‌స్టీన్లు జీవశాస్త్ర చరిత్రలో 19వ శతాబ్దానికి చెందిన డార్విన్ సాధించిన ఘనతతో పోల్చదగిన ఘనతను బుద్ధుడు ఆధ్యాత్మిక రంగంలో సాధించాడు. అంతేకాదు, ఆయన నిర్వచించిన ఆధ్యాత్మ జీవన సూత్రాలు వీటిని తమలో యిముడ్చుకున్నాయని యీ రచయిత వ్రాసిన "విజ్ఞానవీచికలు" చూస్తే తెలుస్తుంది.

క్రీస్తుకు పూర్వం 6వ శతాబ్దంలో కపిలవస్తు నగరాన్ని పరిపాలించిన క్షత్రియరాజైన శుద్ధోదనుడు శాక్యవంశానికి చెందినవాడు. రాణి మాయావతి. ఆమె ఒకసారి కపిలవస్తు నుండి సపరివారంగా ప్రయాణం చేస్తుండగా నేపాల్ సరిహద్దులోని లుంబినీ వనంలో ఆమెకొక మగ శిశువు జన్మించాడు. నాటికేడవ రోజునే ఆమె మరణించింది. తల్లి ప్రేమను కోల్పోయిన ఆ శిశువుకు ఎట్టి బాధా తెలియనివ్వకుండా అల్లారు ముద్దుగా పెంచాడు శుద్ధోదనడు. పిల్లవానికి సిద్ధార్థుడు అని నామకరణము చేసారు. సిద్ధార్థుడు సమర్థులైన గురువుల వద్ద సకల విద్యలూ అభ్యసిస్తూ, బహుముఖ ప్రజ్ఞాశాలియైన యువకుడుగా రూపొందాడు. విలువిద్యలో సాటిలేని నైపుణ్యాన్ని గడించి పోటీలో సాటివారినందరినీ జయించి తన పదహారవయేట మహాసౌందర్యవతియైన యశోధరను భార్యగా గెలుచుకున్నాడు. బ్యాలంనుండీ సుఖసంతోషాలతో, సిరిసంపదలతో బహు గారాబంగా పెరిగిన సిద్ధార్థుడు అనుకూలవతియైన భార్యవలన రాహులుడనే కొడుకుని పొందాడు. అయినప్పటికీ వృద్ధాప్యంలో అడుగిడుతున్న శుద్ధోదనునికి హృదయంలో ఒక భయం దాగివున్నది. సిద్ధార్థుడు జన్మించినపుడే దైవజ్ఞులు అతని జాతకాన్ని, అత్యుత్తమమైన శరీరక సౌష్టవాన్ని పరిశీలించి అతనొక మహారాజు గాని, లేక గొప్ప సన్యాసి అవుతాడని చెప్పారు. దానికి తోడు సిద్ధార్థుడు సకల విద్యలలోనూ ఎంత ప్రావీణ్యం గడిస్తున్నా భౌతిక సుఖాలచేత తృప్తిచెందక జీవిత రహస్యాన్ని శోధించేవానిలా, వాటితో ఎప్పుడూ తృప్తి చెందినట్లు కనిపించేవాడు కాదు. అతడు ఎక్కడ విరాగియైపోతాడోనన్న భయంతో అతడెన్నడూ దుఃఖాన్ని, కష్టాన్నీ చవిచూడకుండా యధాశక్తి జాగ్రత్త తీసికోచూచాడు శుద్ధోదనుడు.

అయితేనేమీ? ఒకసారి జీవితరహస్యాన్ని కనుగొనాలన్న జిజ్ఞాస హృదయంలో రగిలాక ఆ దివ్యజ్యోతిని ఆర్పగల సామర్థ్యం దేనికీ లేదు. గర్భంలోని శిశువులా, ఉదయించనున్న సూర్యబింబంలాగా, అది తప్పక బహిర్గతం కావలసిందే. ఒకనాడా రాజకుమారుడు తన రథంలో నగరాన్ని తిలకిస్తుండగా ఒక వృద్ధుని, తరువాత ఒక రోగిని, తరువాత ఒక శవాన్నీ చూసి విస్తుపోయి రథసారధిని అడిగాడు. ఏనాటికయినా ప్రతి ఒక్కరూ అట్టి పరిణామాలను చెందక తప్పదని చెప్పడంతో సిద్ధార్థుడు యిల్లుచేరి, సుదీర్ఘమైన ఆలోచనలో పడ్డాడు. తరువాత ఒకసారి ఒక సన్యాసిని చూచి, అతడు సర్వబంధాలను త్యజించి, యిల్లువిడిచి, దుఃఖాన్ని అతిక్రమించే పవిత్ర జీవితాన్ని ఆశ్రయించాడని తెలుసుకున్నాడు. అంతటితో తాననుభవిస్తున్న సర్వసుఖాలను గురించి లోతుగా ఆలోచించాడు.

వృద్ధాప్య, రోగ, మరణాదుల రూపంలోనేగాక యింకెన్నో రూపాలలో దుఃఖమనే అగ్ని మానవ జీవితాన్ని అనుక్షణమూ దహించివేస్తుండటాన్ని గమనించాడు. తగలబడుతున్న ఇంటిని ఆర్పివేసేవానిలా అతిశీఘ్రంగా తాను మానవ దుఃఖ నివృత్తికి ఉపాయాన్ని వెదకవలసిన ఆవశ్యకతను గుర్తించాడు. గాఢనిద్రలో నిమగ్నులైన భార్యాబిడ్డలకు మనస్సులోనే వీడ్కోలు చెప్పి, తన రథంలో అరణ్యానికి వెళ్ళాడు. అన రథసారధి అయిన చెన్నుడికి వీడ్కోలు చెప్పి పాదచారియై వెళ్ళిపోయాడు. అతడు తన పొడుగాటి అందమైన జుట్టును, విలువైన ఆభరణాలను, వస్త్రాలను విడిచిపెట్టి భిక్షు వేషంలో విశాలమైన ప్రపంచంలోకి

అడుగు పెట్టాడు. అతను పుట్టినప్పుడు దైవజ్ఞులు చెప్పిన రెండవ మాటే నిజమైంది.

సిద్ధార్థుడు మొదట అలర కళాముడు, ఉద్దాకుడు అనే తపస్వులను కలిసి దుఃఖాన్ని గురించి జీవిత సత్యాన్ని గురించి ఎన్నో ప్రశ్నలు వేసాడు. వారి సమాధానాలు అతనికి తృప్తినివ్వలేదు. తర్వాత మగధ రాజ్యంలోని ఉరువేల పట్టణ శివార్లలోని ఒక వనంలో 6 సం॥ల పాటు తన శరీరాన్ని శుష్కింపచేస్తూ కఠోరమైన తపస్సు చేసాడు. భయాన్ని, సుఖాపేక్షనూ జయించి మనోనిగ్రహాన్ని సాధించాడు గానీ, అతనికి సంపూర్ణమైన జ్ఞానం లభించలేదని గుర్తించి, మరల యుక్తమైన ఆహారాన్ని క్రమబద్ధంగా స్వీకరించదలిచాడు.

అంతటితో తపోభ్రష్టుడయ్యాడని తలచి అతడి సాటి సన్యాసులయిదుగురు అతనిని విడిచి వెళ్ళిపోయారు. అతను మొదట భిక్షను సుజాత అనే శూద్ర స్త్రీ నుండి గ్రహించి, స్నానం చేసి ఒక రావిచెట్టు క్రింద పద్మాసనంలో కూర్చున్నాడు. అప్పటికప్పుడే తీవ్రమైన యత్నంతో, అన్వేషణతో జ్ఞానాన్ని సంపాదించి తీరాలని నిశ్చయించుకున్నాడు. అది మే నెల. నాడు పూర్ణిమ అప్పటికి అతని వయస్సు 35 సం॥లు, మతం మత్తు మందని, ఆధ్యాత్మికతంతా ఒక మధురమైన పగటికల అని, జీవితవాస్తవాలనుండి పారిపోవటమేననీ బొబ్బలు పెట్టడం ఫ్యాషన్ అయిన ఈ రోజుల్లో తమకున్న సుఖాలను పరిత్యజించి నిరుపేదల జీవిత విధానాన్ని, అత్యంత ప్రతిభాశాలురైన విజ్ఞాన శాస్త్రజ్ఞుల (సైంటిస్టుల) సత్యశోధనా సరళినీ స్వచ్ఛందంగా స్వీకరించగల గుండె ధైర్యం ఎందరికుంటుంది? తన జీవితాన్నే ఒక భయంకరమైన శాస్త్రీయ ప్రయోగశాలలాగా చేసికోగల విజ్ఞాన శాస్త్రజ్ఞులు ఎందరుంటారు ?

వ్యాసారంభంలో బుద్ధుని న్యూటన్, ఐన్స్టీన్ వంటి విజ్ఞాన శాస్త్రజ్ఞులతో పోల్చడం సమంజసమే. కారణం సర్వ సుఖదుఃఖలకూ మూలమైన మనస్సును, వాటికి కారణమైన వస్తువుల తత్త్వాన్ని ప్రత్యక్షమైన ప్రయోగాలతో శాస్త్రీయమైన విధంగా పరిశీలించాడు సిద్ధార్థుడు. ఆకాశంలో పున్నమి చంద్రుడు విరాజిల్లుతున్న ప్రశాంత సమయంలో సిద్ధార్థుని ప్రజ్ఞ హృదయాకాశంలో నక్షత్రాలవలె అసంఖ్యాకంగా మెరుస్తున్న జీవితానుభవాలను శాస్త్రీయమైన రీతిన పరిశీలించ సాగింది. 7 రోజులు గడిచిపోయాయి. వృద్ధి క్షయాలు లేని సూర్యునిలాగా అతని హృదయాకాశంలో జ్ఞానజ్యోతి శాశ్వతంగా నిలిచింది. సిద్ధార్థుడు బుద్ధత్వాన్ని చెందాడు. వసంత ఋతువులో ప్రకృతి తల్లి వినూత్న శోభను, సౌందర్యాన్ని సంతరించుకున్నట్లు అతని దృష్టికి సకల సృష్టీ, సర్వ జీవులూ శాశ్వతమైన జ్ఞాన స్వరూపాలుగా గోచరించాయి.

తరువాత బుద్ధుడు తన సాటి అయిదుగురు సన్యాసులను కాశీ సమీపాన వున్న సారనాథ్‌లో కలుసుకుని, వారికి మొట్టమొదటగా తాను సంపాదించిన జ్ఞానాన్ని బోధించాడు. అది వింటూనే కౌండన్న అనే సాధువు జ్ఞానాన్ని పొంది మొదటి శిష్యుడయ్యాడు. తరువాత మిగిలిన నలుగురూ కూడా శిష్యులయ్యారు. వారిని ప్రపంచంలో తన జ్ఞానాన్ని నలుమూలలా మానవాళికి పంచమని ఆదేశించాడు. జ్ఞానపూర్ణుడైన బుద్ధుని, ఆయన బోధించిన ధర్మమనే దుఃఖ నివారణోపాయాన్ని, అందుకుపకరణంగా స్థాపించబడిన సంఘాన్ని ఆశ్రయించినవారినీ ఎట్టి భేదాలు లేక అంగీకరించవచ్చునని వారికి చెప్పాడు. తరువాత వర్షాకాలంలో ఉరువలే పట్టణ శివార్లలో కశ్యపుడు మొ॥న అగ్నిదేవతోపాసకులకు ధర్మాన్ని బోధించి శిష్యులను చేసికొన్నాడు. ఇలా ఎన్నో ప్రాంతాలలో ఎందరికో ధర్మ బోధచేస్తూ, తన తండ్రి మళ్ళీ మళ్ళీ కోరినమీదట స్వస్థలమైన కపిలవస్తుకు ధర్మ విజయం కోసం వేంచేసాడు. యశోధర రాహులుణ్ణి ఆయన వద్దకు పంపి, తన వారసత్వాన్ని తనకివ్వవలసిందిగా కోరమని చెప్పింది. తక్షణమే బుద్ధుడు అతనికి దీక్షనిచ్చి బౌద్ధ సంఘంలోనికి తీసికున్నాడు. ఇలా యినాడు ఎందరు తండ్రులు చేయగలరు?

అయినా యిలా దినదిన ప్రవర్ధమానమవుతున్న బుద్ధుని కీర్తిని చూచి బంధువు, శిష్యుడూ అయిన దేవదత్తుడు అసూయ చెంది, తన కుతంత్రాలతో బౌద్ధ సంఘంలో చిధ్రాన్ని కల్పించాడు. అయినప్పటికీ అధికారము చేజిక్కకపోయేసరికి బుద్ధుణ్ణి చంపాలని కూడా ప్రయత్నం చేసాడు. మదించిన ఒక ఏనుగుకు మద్యం త్రాగించి బుద్ధుని మీదకు విడిచాడు. కాని అంత వరకూ మహాక్రూరంగా పరిగెత్తి వచ్చిన ఆ ఏనుగు హృదయంలో బుద్ధుని చూడగానే మానవత్వం మేలుకొన్నది. బుద్ధుని మైత్రి ప్రతిబింబించింది. మరుక్షణమే ఎంతో సౌమ్యంగా తిరిగి వెళ్ళిపోయింది. ఇది ఒక కట్టుకథేమోనని అనుమానించనక్కర్లేదు. అక్కల్‌కోటస్వామి చరిత్రలో యిటీవల కాలంలోనే జరిగిన యిటువంటి ఘట్టాన్నే చూడవచ్చు.

తరువాత బుద్ధుడు దేశసంచారం చేస్తూ 'పావ' అనే గ్రామంలో కుందుడనే కమ్మరికి చెందిన మామిడితోటలో విడిదిచేసారు. ఒకనాడు భోజనమయ్యాక దస్సిన బుద్ధుడు కుడివైపుకి ఒత్తిగిలి ధ్యాననిష్టలో పడుకుంటూ, "ఇక దస్సిపోయాను, విశ్రమిస్తాను" అన్నారు. ఆయన అంతిమ ఘడియ సమీపించిందని గుర్తించిన ఆనందుడనే శిష్యుడు కన్నీరు పెట్టాడు. సమీప గ్రామాలనుండి ఎందరో భక్తులు దర్శనానికి వచ్చారు. వారందరికీ ముందటిరాత్రి, ఆ రోజూ కూడా ఆయన విరామం లేకుండా సన్నిహితులైన శిష్యులకు ధర్మాన్ని వివరించి, "బాహ్యమైన వేరొక ఆలంబనాన్ని ఆశ్రయించక ఈ ధర్మాన్ని, మీ జ్ఞానాన్ని మాత్రమే ఆశ్రయించి, మీ యత్నంతో మిమ్మల్ని మీరే ఉద్ధరించుకోండి!" అన్నారు. తరువాత కన్నులు మూసుకుని ఉత్తమ ధ్యాన స్థితినొంది శరీరాన్ని త్యజించారు. 7 రోజులు భక్తులొచ్చి ఆయన దేహాన్ని దర్శిస్తూనే వున్నారు. తరువాత వారి దేహాన్ని దహనం చేసి, అస్థికలను దేశంలో 10 చోట్ల భూస్థాపితం చేసి స్థూపాలను నిర్మించారు. అయితే లుంబినీవనము, కుసినారము, బుద్ధ గయ, సారనాథ్ తప్ప తక్కిన యీ స్థూపాలను చరిత్రకారులింతవరకూ నిస్సంశయంగా గుర్తించలేకపోయారు.

ఆనాడు బుద్ధుడు కనుగొని చెప్పిన దుఃఖ నివృత్త్యుపాయం ఏమిటి? మనిషి చేతలన్నీ అతని యోచనా ఫలితాలు. అతడు తనలోని రాగద్వేషాది వికారాలెలా పని చేస్తాయో గమనించి, వాటిని సరైన అవగాహనతో తొలగించుకోవాలని చెప్పాడు. దానిని విస్మరించి, యీనాడు మానవాళి సాధిస్తున్న సాంకేతిక వైజ్ఞానిక ప్రగతి ఎంత వినాశకరంగా పరిణమిస్తున్నదో చూడవచ్చు. అన్ని జీవుల రూపాలూ వేరుగావచ్చుగాని, వాటి ద్వారా ప్రకటమయ్యే జీవశక్తి మాత్రం ఒక్కటే. దాని యొక్క సుఖ దుఃఖాది అనుభవాలూ సమానమే. కనుక ఈ సత్యాన్ని విస్మరించి సాటి జీవులకు స్వార్ధంతో మానసికంగానో, శారీరకంగానో కష్టం కలిగించే ప్రతివాడూ ఏదో విధంగా జీవరాశియంతటికీ, చివరకు తనకు గూడా దుఃఖాన్ని సిద్ధం చేసుకుంటున్నాడు. కారణం న్యూటన్ చెప్పినట్లు ప్రతి చర్యకూ ప్రకృతిలో సమానము, ప్రతికూలమూ అయిన ప్రతిచర్య వుండితీరుతుంది. కొలనులో బడ్డ రాయి కలిగించిన సంచలనం తీరందాకా వ్యాపించి, దానికి ఢీకొని, తిరిగి తరంగ రూపంలో ఆ కేంద్రానికే చేరుతుంది. నీరు సామ్యస్థితి చేరేందుకు చేసే యత్నంలో భాగమిది. ఇదే బుద్ధుడు చెప్పిన కర్మ సూత్రం. రాయిపడిన కొలనులోని కేంద్రాన్ని – అంటే సర్వత్రా తత్త్వతః అవిచ్ఛిన్నంగా వున్న జీవశక్తిలో ద్వేషము, హింస అనే సంచలనానికి కేంద్రమైన హృదయాలను ధ్యానం ద్వారా, అవగాహన ద్వారా ప్రశాంతం చేయగలిగితే, ప్రతి వ్యక్తీ సకలజీవశ్రేయస్సుకూ దోహదం చేసినవాడవుతాడు. కనుక ప్రతి వ్యక్తికీ యిలాంటి అవగాహన, క్రమశిక్షణ అందించడమే బుద్ధుని లక్ష్యం. కనుక యీ బుద్ధపూర్ణిమనాడు మనమందరమూ హృదయ పరిశీలనం చేసుకొని ఆయన ప్రసాదించిన జ్ఞానమనే వారసత్వానికి అర్హులమనిపించుకుందాము. మానవుడికి గల బుద్ధిశక్తిని సార్థకం చేసికొని నిజమైన మనుషులుగా అవమనేగా ఆయన బోధించింది?

---

# మానవాళికి అందిన మహిత వరం సాయిబాబా

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

తలచిన హృదయాలలో ఆరని మంటలనార్పి, తీయని ప్రేమనుకురిసే నామం సాయిబాబా, ప్రతిఫల మెరుగని ఆయన జీవితం పరిపూర్ణ జీవితానికి ప్రతీక. అలౌకికమైన నిష్ఠ, కఠిన నియమాలతోనూ సాగిన ఆయన జీవితం అనుసరణీయం మాత్రమేకాదు – నిత్యానుస్మరణీయం కూడా. ఆయన కోపం, కరుణా రెండూనూ ఫలితం దృష్ట్యా చూస్తే భక్తుల బాగుపట్ల ఆయన చూపే శ్రద్ధకే నిదర్శనాలు. అందుకే సాయిబాబా అంటే ఆయన భక్తుల దృష్టిలో దివ్యశక్తి తమపై కరుణతో దాల్చిన రూపం.

ఆయన భక్తులలో అన్ని మతాల' సాంప్రదాయాలవారూ ఉన్నారు. అన్నింటినీ ఇముడ్చుకొన్నదే సాయి సాంప్రదాయం. మతద్వేషంలో మంట గలుస్తున్న మానవాళికి మానవతా విలువలనొకవైపు బోధిస్తూ, అన్ని సాంప్రదాయాల ఆదర్శమూ, ధ్యేయమూ ఒకటేనని తన నిత్య జీవితాన్నే ఒక ఉదాహరణగా నిలిపారు శ్రీసాయి.

సాయిబాబా ఎక్కడ, ఎప్పుడు, ఎవరికి జన్మించారోనన్నవిషయం ఇదమిత్థంగా తెలిసినవారు లేరు. మొదట 16 ఏళ్ళ వయస్కులుగా 1854 సం॥లో శిరిడీలో కన్పించారు. ఆ తరువాత 1918 విజయదశమి వరకూ శిరిడీలోనే వుండిపోయారు. శ్రీ సాయినాధుడు ఏ సాంప్రదాయంవారోనన్నది నిస్సందేహంగా చెప్పడమూ కష్టమే. ఆయనకు 'సాయిబాబా' అన్న పేరు భక్తులు పెట్టినదే. వేషానికి ఫకీరు. నియమానికి కఠిన బ్రహ్మచారి. సాంప్రదాయానికి సర్వసముదాయన, ఉన్నదిపాడుబడిన మసీదులో, అందులో (పార్శీలకూ, హైందవులకూ ముఖ్యమైన) అగ్ని ఆరాధన, వాకిట తులసీ బృందావనం ఐదిళ్ళంటే ఐదే ఇళ్ళలో భిక్ష, తనవి అంటూ ఆయనకేమీ ఉండేవి కాదు – చేతిలోని దండం, చిలిమ్ గొట్టం, ఓ రేకు డబ్బా, జోలె, తొడుక్కొన్న పొడవైన పాత చొక్కా, తలగుడ్డా తప్ప. ఆ ఫకీరును ఆశ్రయించిన వారిలో పండితులు, కోటీశ్వరులు, అతి సామాన్యులు, మహాత్ములుగా ఎంచబడినవారూ ఉన్నారు. ఆ భిక్షకుని చూపుతో, మాటతో, స్పర్శతో లౌకికంగానూ ఆధ్యాత్మికంగానూ ఉన్నత స్థాయిని అందిన వారెందరో ఉన్నారు.

హీడాబేగ్, అన్వర్‌ఖాన్ అనేవారు ఆధ్యాత్మిక పరిణతి కొరకు బాబాను ఆశ్రయించారు. ఖురాన్ గ్రంథం నుండి అరబ్బీ ప్రార్థనలు వారికుపదేశించి బేగ్‌ను కనాడ్‌వద్ద, అన్వర్‌ను బాగ్దాద్‌లోనూ నిజమైన ఫకీర్లలా జీవించమని ఆశీర్వదించి పంపారు సాయి. ఢిల్లీ నివాసి యాకూబ్ అనే ముస్లిం సాధకుడు పవిత్రమైన బాబా సన్నిధిలో ఖురాన్ పఠించి పవిత్రుడయ్యాడు. హజరత్ దర్వేషా (ఔరంగాబాద్), ఫకీర్ అమీరుద్దీన్ (నాందేడ్) వంటి ముస్లిం గురువులు తమ శిష్యులను సాధనలో మెలకువలు తెలుసుకొమ్మనీ, ఆశీర్వాదాలు పొందిరమ్మని బాబా వద్దకు పంపేవారు. గంగగిర్, మెహెర్ బాబా వంటివారు బాబాను గూర్చి – 'ఆయన కోహినూర్' 'ప్రపంచాన్ని ఆధ్యాత్మిక పథంలో నడిపేందుకు ఉన్న 72 మంది గురువలలో ఐదుగురు గొప్పవారు. వారిలో సాయి తలమానికంవంటివారు.' 'నాకు ఆయనను గూర్చి తెలిసినంత మీకూ తెలిస్తే ఆయన ఈ సృష్టికే అదినాధుడని మీరే అంటారు' అన్న మాటలు అక్షర సత్యాలనడం స్వభావోక్తే.

కాశీనాథ్ ఉపాసనీశాస్త్రి (ఉపాసనీ బాబా, సాకోరి), నానాసాహెబ్ చందోర్కర్, మూలేశాస్త్రి, దాసగణు మహరాజ్ లాంటివారిని ఆయన (హైందవ) ఆధ్యాత్మిక సాధనపరంగా సానబెట్టారు. భగవద్గీతను భాష్యత్రయంతోసహా క్షుణంగా చదివాననే విద్యాగర్వంగల చందోర్కర్ గర్వాన్ని అతను వివరించలేని ఒక శ్లోకానికి (అధ్యాయము–4. 34 శ్లోకం) అసాధారణ వివరణనిచ్చి అణచారు, ఆ 'చదువురాని' బాబా. అలాగే వేద పఠనం మధ్యలో మంత్రం మరచిన దక్షిణదేశ పండితులకా మంత్రాలు అందించిన సాయికి ఖురానే వచ్చునందామా ........, వేదమే వచ్చునందామా!

మసీదులో శ్రీరామనవమి, గురుపూర్ణిమ, అలాగే మొహరమ్ వంటి ఉత్సవాలు ఆయన అనుమతితో జరిగేవి. ఆ ఉత్సవాల్లో హిందూ ముస్లింలనే తేడాలేక అందరూ ఒకే తల్లి బిడ్డల్లా కలసి మెలసి పాల్గొనడం ఈ శతాబ్దంలోనే జరిగిన సత్యం! విచిత్రమేమీకాదు!

ఆయన 'అల్లా మాలిక్' అనీ, 'అల్లా అచ్చాకరేగా' అనీ అంటూండేవారు. తనగురువు 'రోషన్ షా' అని కొందరితో, 'వెంకూసా' అని కొందరితో చెప్పేవారు. హరినామం చేసి చేసి హరినయ్యానన్నారు. రాముడు, కృష్ణుడు మొ॥ వారు చారిత్రక పురుషులనేవారు. అలాగే జ్ఞానేశ్వరీ భగవద్గీత, భాగవతం, విష్ణు సహస్రనామం, గురుచరిత్ర పారాయణ చేయమని

మహారాజై కూడా బిచ్చగాని దుస్తులు ధరించగలవాడే మంచివాడు.

భక్తులకు చెప్పేవారు. తానున్న మసీదుకు ద్వారకామాయి అని పేరుపెట్టారు. హిందూ భక్తులాయనను దత్తావతారంగా కొలిచేవారు.

బాబా మత ద్వేషాన్ని సహించేవారుకారు. మత మౌఢ్యం కలిగిన ఒక ముస్లిం మసీదులో నిద్రిస్తున్న హిందువులను చూపుతూ వారు ఇస్లాం సాంప్రదాయాన్ని, మసీదునూ పూజాదికాలతో అపవిత్రం చేస్తున్నారనీ, కనుక వారినందరనూ చంపుతాననీ బాబాతో అన్నాడు. అందుకాయన వారిని తానే రమ్మని, అలా చేయమని ప్రోత్సహించాను కనుక తననుసంహరించడం సరైనపని అని అడ్డుపడ్డారు. దానితో ఆ వ్యక్తి మరలి పోయాడు. అలాగే ఓ రోహిల్లా రాత్రులందు 'అల్లాహో అక్బర్' అని అరుస్తూ తమ నిద్రకు భంగం కల్గిస్తున్నాడని హిందువులారోపించగా అతని సాంప్రదాయ బద్ధమైన ప్రార్ధనా విధిని నిరసించడం సబబు కాదని బాబా మందలించారు. ముస్లిం మతం స్వీకరించిన ఒక యువకుడిని లాగి చెంపిదెబ్బ కొట్టి "అబ్బను మార్చుకొన్నావటరా!" అని మండి పడ్డారు. మరో మారు చక్రనారాయణ అనే క్రైస్తవ ఉద్యోగి బాబా స్వీకరించే దక్షిణల వివరం సేకరించేందుకు ప్రభుత్వ ప్రతినిధిగా రాగా అతనిని భక్తులు దుయ్యబట్టారు. వారు అతనిని అలా విమర్శించినందుకు బాబా వారిని తీవ్రంగా నిరసించారు. పరదూషణ చేసే ఒకనికి పందిని చూపుతూ బాబా 'అదిచేసే పనే నీవూ చేస్తున్నావు. ఇలా ఐతే శిరిడీ వచ్చీ ఏం ఉపయోగం?" అని మందలించారు. మత సహనం, మతాలన్నింటికీ మూలమైన సత్యం ఆయనకు ప్రధానం.

బాబా జీవితం సాధువుల, మహాత్ముల జీవితం ఎలా ఉండాలో చెప్పే ప్రత్యక్ష ప్రమాణం, ఆదర్శం. తమ సిద్ధాంతాలే గొప్పవని వాటిని సామాన్యులపై రుద్దే ఎందరో బాధగురువుల,' ఆచార్యుల, భగవానుల బారినుండి రక్షించి నిజమైన బోధ గురువులను ఎంచుకొనేందుకు పనికివచ్చే గీటురాయి ఆయన జీవితం. వారి జీవితంలో వ్యక్తమయ్యే నాలుగంశాలు పేర్కొనితీరాలి.

1) హిందూ భక్తులకు బాబా వారి వారి ఇష్టదైవాలైన రామ, విఠల, దత్త, మారుతి రూపాలలోనూ, శ్రీ అక్కల్‌కోట స్వామి, గురు ఘోలప్ స్వామి మొ॥న గురువుల రూపంలోనూ దర్శనం ఇచ్చారు. అన్ని జీవులలోనూ, అన్ని ప్రదేశాలలోనూ, తన ఉనికిని నిరూపించాయి. ఆయన లీలలు, ఆనాటి మహాత్ములే ఆయనకు చెయ్యెత్తి మొక్కారు. కోటీశ్వరులాయన వాకిట నిలిచారు. ఐనా "నేను భగవంతుని బానిసను. పేద ఫకీరును," అనే వారాయన. "నేనే భగవంతుడిని" అనే నకిలీ బాబాలకూ, 'మహాత్ములకూ' ఆయనకూ ఎంత తేడానో! ఆయన సముద్రం, వారో, మురికి కాల్వలు.

2) "రేపటిగుర్చి ఆలోచించకు" అన్న క్రీస్తు సందేశం, నిజమైన సాధువుకు ఆశ్రమ మఠాది నిర్మాణం, శిష్యకోటిని కూర్చుకోవడం, తన కొరకుగానీ, పవిత్ర కార్యాలకనిగానీ, ధన వస్తు సముదాయాన్ని సేకరించడం, సన్మానాదుల నందుకొనడం నిషిద్ధమని చెప్పిన హిందూ శాస్త్ర గ్రంథాలలోని నియమాలనీయనవలె ఎందరు పాటించారు? రోజూ సాయంకాలం వరకూ భక్తులిచ్చే దక్షిణల మొత్తాన్ని (ఆ రోజులలోనే సుమారు 3, 4 వందల రూపాయలండేది!) తినుబండారాలనూ, విలువైన వస్త్రాలనూ ఆ రోజు కారోజే పేదలకు పంచేవారు బాబా. తనకోసం జోలెతో ఐదిండ్ల భిక్ష చేసేవారు. అందుకే ఈ నాటి నకిలీ స్వాములలాగా ఆయన 'ధనస్వాములు' కాలేకపోయారు.

3) భక్తులాయనకు ఒక పల్లకీ, గుఱ్ఱం, రథం – అన్ని హంగులూ సమకూర్చారు. ఐనా శిరిడీలో ఆయన ఉన్న అరువదేండ్లలోనూ ఒక్కసారి కూడా వాటిని ఆయన వినియోగించక, చెప్పులు కూడా ధరించక చిరిగిన గుడ్డలతోనే ఊరంతా తిరిగేవారు. అడుగు దూరం వెళ్ళాలన్నా విదేశీ కాడిలాక్ కార్లు కావాలనే ఈ 'మహాత్ముల' వరుసలో ఆయనెలా నిలబడగలరు!

4) 'ఇతర మహాత్ములంతా మోసగాళ్ళు' గారడీలవారు హిప్నోటిస్టులు' అని ఇతరులపై బురద చల్లుతూ, పైగా తాను తప్ప తరింపజేయగల వాడు లేడనే ఈ కుహనా మహాత్ములకూ, "నీ గురువునే అచంచల విశ్వాసంతో అట్టి పెట్టుకో, ఆయన సామర్థ్యం ఎంత తక్కువ దైనా సరే" అని బోధిస్తూ ఆరతిలో తుకారామ్ వంటి మహాత్ముల గూర్చిన పాటలు భక్తులు పాడే సమయంలో ఎంతో భక్తిగా చేతులు జోడించి వినయంగా కూర్చొనే బాబాకు సాపత్యమెక్కడ ? వీరికి ఆయన జీవితమే ఒక గుణపాఠం.

బాబా చూపిన బాటలో నడుద్దాం, ఆయన బిడ్డలమనిపించుకొందాం. ఆయన కృపకు అర్హులమౌదాం.

---

# శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి

డా. టి.ఎమ్.పి. మహదేవన్

(ఆంగ్లవ్యాసానికి అనువాదం)

"గురువనగా ఎవరు? తత్త్వాన్ని దర్శించినవాడు, సదా శిష్యునికి శ్రేయస్సు చేకూర్చువాడు" అని ఆదిశంకరుల ఉవాచ. నేడు మనదేశంలో అట్టి స్థానాన్నలంకరించిన వారిలో పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు ప్రముఖులు. వీరు తమ జగద్గురు పీఠాన్ని శ్రీ జయేంద్ర సరస్వతీ స్వాములవారికి ఒప్పగించి మహారాష్ట్రంలో పర్యటిస్తున్న జీవన్ముక్తులు. పూర్వాశ్రమంలో వీరి పేరు స్వామినాధన్. వీరు విల్లుపురంలో శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీమతి మహలక్ష్మి అనే దంపతులకు ద్వితీయ సంతానం. బాల్యంలో జరిగిన రెండు సన్నివేశాలు వీరికి జీవితంగూర్చి చక్కటి అవగాహనను ప్రసాదించాయి. ఒకరాత్రి ఒక జంగుబిల్లి ఉట్టిపైనున్న రాగిపాత్రలోని బెల్లం తినడానికి తల దూర్చిందిగాని, తిరిగి జయటకు తీసుకోలేక, దారిగానక, ఇల్లంతా గోలచేసింది. ఎవరో శ్రమపడి దానిని విడిపించారు. స్వామినాధునకు దురాశ తనకూ, సాటివారికీ కూడా ఎంత దుఃఖంచేటో బాగా అర్ధమైనది. మరొకసారి పంచలో నున్న స్వామినాధన్ చేతి మురుగులను ఒక వ్యక్తి అపహరిచాడు. మానవులకు స్వార్ధం ఎంత సహజమో ఆ బాలునకర్ధమైంది. ఈ బాలుడే తర్వాత జగద్గురువులయ్యాక ఇలా అన్నారు. " సంవత్సరాలు గడచిన కొద్దీ ధర్మనిష్టులై సాటివారి శ్రేయస్సుకొరకు మాత్రమే జీవించేవారు. కొందరు ఈ భూమిపై తప్పక జీవిస్తుంటారన్న భావం నాలో బలపడసాగింది. అట్టివారు తమ సిరిసంపదలనేకాక, తమ అభివృద్ధికవసరమైన సాధనను కూడ సాటివారి సేవకోసం త్యాగం చేస్తారని నాకు తోచేది." ఈ మాటలు బహుశా అయన హృదయంలో మేల్కొంటున్న ప్రజ్ఞకు సూచన కాబోలు.

వీరి ఉజ్జ్వల భవిష్యత్తును సూచించే ఛాయలు బాల్యంలోనే వ్యక్తమయ్యాయి. స్వామినాధన్‌కు 1905 లో ఉపనయనం చేసినపుడు 66వ కామకోటి పీఠాధిపతులు తమ ఆశీస్సులను పంపారు. 1906 లో స్వామినాధన్ తన తండ్రితో కలసి ఆ పీఠాధిపతులను దర్శించి మంత్రముగ్ధులయ్యారు. అనతికాలంలో ఒక మిత్రునితో కలసి తల్లిదండ్రులకు చెప్పకుండా పీఠాధిపతులను దర్శించాడు. ఇంటికి వెళ్ళడానికా బాలుడు సెలవు కోరినపుడు స్వామి అతనిని ఉండమన్నారు. కాని మరుసటి రోజు బడికి వెళ్ళాలని బాలుడు చెప్పడంతో మఠానికి చెందిన వాహనంలో అతనిని ఇల్లు చేర్చారు. అతడు వెళ్ళిపోగానే అతనిని తమ పీఠానికి వారసుని చేయాలన్న అభిలాషను జగద్గురువులు అక్కడున్న కొందరు పండితులతో చెప్పారు. కాని 1907లో ఆచార్యులు ఆకస్మికంగా పరమపదించడంతో స్వామినాధనుగారి పిన్నిగారి కుమారుని పీఠాధిపతిగా చేశారు. తర్వాత సమాచారాన్ని శ్రీ పరమాచుర్యులే ఇలా వ్రాశారు. " మా అమ్మ పిల్లలందరితో కలసి కలవాయికి తన సోదరిని ఓదార్చడానికి బయల్దేరారు. కారణం ఆమె కుమారుడు సన్యాసాన్ని స్వీకరించడమే ......... కలవాయినుండి మహాపూజకు కావలసిన వస్తువులు కొనడానికి మఠం నుండి ఒక బండి వచ్చింది. మఠానికిచెందిన మేస్త్రిగారు నాతో నాజీవితశేషమంతా మఠంలోనే గడపవలసి ఉంటుందని, ఆచార్య పదవినలంకరించిన మా పిన్ని కుమారునికి జ్వరంలో అపస్మారకం రావడంవలన నన్ను కలవాయికి తీసుకుపోతున్నామని చెప్పాడు. నేను నిర్ఘాంతపోయాను. ఇక దారి పొడుగునా "రామా ! రామా! అనుకుంటూ నాకు తెలిసిన ఒక్కప్రార్ధననూ చేస్తూ ఉండిపోయాను." 1907 ఫిబ్రవరి 13న స్వామినాధన్ పీఠాధిపతి గావించబడి జగద్గురు శ్రీ చంద్రశేఖరేంద్రస్వామివారిగా వెలశారు. 1911 నుండి 1914 వరకు కుంభకోణానికి సమీపంలో అఖండ కావేరీతీరాన కుటీరంలో నివసిస్తూ సంస్కృతము, సంగీత, గణిత, జ్యోతిషశాస్త్రాలను అధ్యయనం చేశారు. 1919 నుండి 1999 వరకు యావద్భారతదేశం పర్యటించారు. అత్యవసరమైనపుడు పల్లకి తప్ప మరేవాహనాన్ని ఉపయోగించలేదు. పర్యటన పొడుగున నిత్యానుష్ఠానము, మఠ వ్యవహారాలు, దర్శనార్ధం వచ్చిన అసంఖ్యాకులకు హితభోధ చేస్తూ,

మితంగా భుజిస్తూ, రోజుకు మూడు నాలుగు గంటలు మాత్రమే నిద్రించేవారు. ఈ పర్యటన కాలంలోనే అన్ని కులాలకు, మతాలకు చెందిన వారెందరో జగద్గురువులను దర్శించుకోగలిగారు. ఉదాహరణకు అంధుడైన ఒక ముస్లిమ్ స్వామి దర్శన భాషణలకవకాశం లభించినందుకు పరవశించాడు. స్వామి ఆజ్ఞననుసరించి అచ్చటి భక్తులకు ఇస్లాం మత ధర్మాలను వివరించాడు. 1926లో మరొక ముస్లిమ్ ఆచార్యులను దర్శించి తాను రచించిన సంస్కృత శ్లోకాలతో వారిని స్తుతించాడు. స్వామి సన్నిధిలో అల్లా సన్నిధి ననుభవించానని చెప్పాడు. ఒక గ్రామస్తుడు తనకున్న కొద్ది ఆస్తిని అమ్మి ఆచార్యులకు దక్షిణ సమర్పించాడు. దానిస్థానే అతడికి మరొక పట్టా భూమిని స్వామి ఇప్పించారు.

స్వామిని దర్శించిన వారిలో ప్రముఖ ప్రజానాయకులెందరో ఉన్నారు. శ్రీ సి. రాజగోపాలాచారి ఒకరోజు వెలుపల నిలబడి శ్రీ జమ్నాలాల్ బజాజ్ గారిని స్వామి దర్శనానికి పంపారు. కారణం అడిగిన స్వామితో తామింకా స్నానం చెయ్యక పోవడమే కారణమని తెలిపారు. నిస్వార్థమైన సేవాకార్యక్రమంలో నిమగ్నులైన వారికి స్నానాది విధులను నిర్వర్తించే అవకాశం ఉండకపోవచ్చునని, ఆ కారణంగా వారికి దర్శనం ఇవ్వవలసినదేనని చెప్పి, జగద్గురువులు రాజాజీగారికి దర్శనార్థం పిలిచారు. 1927 లో నెలిచెరి అనే గ్రామంలో మహాత్మగాంధీ స్వామిని దర్శించారు. సాయంత్రం 5.30 ని॥లకు గాంధీగారిని భోజనం చెయ్యవలసినదిగా రాజాజీగారు హెచ్చరించారు. కారణం 6 గం॥ తరువాత ఆయనెన్నడూ భుజించేవారు కాదు. అప్పుడు "స్వామి వారితో కొనసాగిస్తున్న సంభాషణే నేటికి మన భోజనం" అన్నారు గాంధీజీ.

ఎందరో విదేశీయులు కూడా స్వామిని దర్శించారు. మహాత్ములనన్వేషిస్తూ ఇంగ్లండు నుండి వచ్చిన పాల్ బ్రంటన్ స్వామిని నిరాయుధీకరణ మొదలగు అంతర్జాతీయ సమస్యల గురించి ప్రశ్నించారు. "యుద్ధనౌకలను, ఫిరంగులను పరిత్యజించినంత మాత్రాన యుద్ధాలనాపలేరు. ప్రజలు కర్రలతోనైనా కొట్టుకుంటారు. దేశాలమధ్య ఆధ్యాత్మికమైన అవగాహన ఏర్పడినపుడే శాంతి సమృద్ధులు సమకూరగలవు. .......... మానవునిలోని దివ్యమైన ఆత్మ అతనినేనాటికైనా భగవంతుని వైపుకు ఆకర్షిస్తుంది. పరిస్థితులే మానవుని పతనం చేస్తాయి. అతీతమైన ధర్మ సూత్రాలతో సమాజం సామరస్యం చెందితే తప్ప సమస్యలు తీరవు." అని జగద్గురువులు బోధించారు. స్వామివద్ద శెలవు తీసుకొని మరొక ఊరు చేరిన బ్రంటన్‌కు నాటిరాత్రి అద్భుతమైన దర్శనం అయింది. " ఆశ్చర్యచకితుడై నా కళ్ళ ఎదుట స్థూలమైన స్వామిరూపం నిలిచి ఉన్నది. వారి చుట్టు దివ్యమైన కాంతి ఆవరించి ఉన్నది... కన్నులు గట్టిగా మూసుకున్నాకూడా వారిరూపం నాకు గోచరిస్తూనే ఉన్నది." అని బ్రంటన్ తన గ్రంథం వ్రాస్తాడు.

స్వామి పరివారంలో 1927 నుండి ఒక కుక్క కూడ ఉండేది. అదెప్పుడూ స్వామివారి పల్లకీ కిందనే నడిచేది. మఠంవారు ప్రసాదించిన అన్నమే తినేది. స్వామి ఎక్కడున్నా ఆగినపుడు దూరాన కూర్చొని భక్తిశ్రద్ధలతో వారిని పరికించేది. ఆచార్యుల దర్శనమైతేనేగాని అన్నం తినేదికాదు. స్వామి సన్నిధిలోనే దాని జన్మ కడతేరింది.

ఈ దేశపర్యటనలో స్వామి నేరూరు చేరి, అక్కడ జీవన్ముక్తులుగా, అవధూతగా జీవించి మహాసమాధిని చెందిన శ్రీ సదాశివ బ్రహ్మేంద్రుల సమాధిని దర్శించి, అక్కడ నిత్యమూ కొన్ని గంటలు మౌనంగా గడిపేవారు. మామూలుగా శంకర, రామానుజ సాంప్రదాయకులకు పొత్తుకుదరదనుకొంటాము కాని 1931లో జగద్గురువులు రామానుజల జన్మస్థలాన్ని దర్శించి అక్కడి ప్రసంగంలో వివిధ సాంప్రదాయాలు దైవమనే మహాసముద్రాన్ని చేర్చు నదులవంటివేనని చెప్పారు. అలానే చిదంబరంలో నటరాజమందిరాన్ని కూడా దర్శించారు. వారి భక్తులు ఆ విషయమ్మై ఆందోళన చెందారు. కారణం రెండు శతాబ్దాలుగా అక్కడి దీక్షితారులు ఏ శంకరాచార్యులను పాత్రలోని విభూతిని తీసికోనివ్వడంలేదు. కాని వీరి దర్శనంతో పులకితులైన దీక్షితార్లు వీరిని కొన్ని రోజులు కోరి మందిరంలో నివసింపజేశారు.

దేశపర్యటనమయ్యాక జగద్గురులెన్నో లోకహితమైన కార్యాలను చేశారు. వివిధ ప్రాంతాలలోని దేవాలయాలను సక్రమంగా

నిర్వహించడానికి పునరుద్ధరించడానికి స్థానిక ప్రజల సహకారాన్ని సేకరించడానికి ముద్రాధికారుల నేర్పాటుచేశారు. సక్రమమైన వేదాధ్యయనానికి వసతులు కల్పించి వైదిక సభలనెన్నింటినో నిర్వహించారు. శివభక్తులకు, విష్ణుభక్తులకూ మధ్య సామరస్యం ఏర్పరచడానికి కూడా వీరెన్నో సభలను నిర్వహించారు. వీరు 22 మార్చి 1954న పీఠాధిపత్యాన్ని శ్రీ జయేంద్రసరస్వతులకు అప్పగించి అవధూతగా సంచరించారు.

పరమాచార్యుల ఉపదేశాన్ని సంక్షిప్తంగా ఇలా చెప్పవచ్చు...“ క్రమబద్ధమైన జీవితాన్నే వేదాలు విధించేది. విహిత కర్మాచరణ, శీల సంస్కరణ, ఉపాసన, జ్ఞానములన్నవే వైదిక ధర్మాలు. తింటూ, నిద్రిస్తూ, సంతానాన్ని కంటూ పాశవికమైన జీవితాన్ని గడపటం వెలలేని మానవజీవితాన్ని దుర్వినియోగం చేయడమే అవుతుంది. సంపాదించడం, కూడబెట్టటం అన్నదే జీవితలక్ష్యాలు కాకూడదు. వృత్తిని మాత్రమే రక్షించే విద్య అసలైన విద్య కాదు. పిల్లల మనస్సులలో మొదట నాటుకొనవలసింది ధర్మం పట్ల గౌరవం. జీవనస్థాయిని మాత్రమే పెంచడంలో అర్థంలేదు. జీవితాన్ని ఉత్తమమైనదిగా చేయడమే అసలైన ధ్యేయం. .....ధ్యానమనే పవిత్రజలంతో స్నానమాచరిస్తేనే మనస్సు దోషరహితమౌతుంది. అట్టి మనస్సుకు నిత్యానిత్యవివేకం ఏర్పడి జ్ఞానానికి మార్గం లభిస్తుంది.... జ్ఞానులు జీవించడమే జగత్తుకొక వరం. మహాపురుషులు సంపర్కంవలన జనులు వారికి తెలియకనే శ్రేయస్సును పొందుతారు. ... అవాఙ్మానస గోచరమైన శాంతిని మహాత్ములు ప్రసరింపజేస్తారు. అట్టివారి సాంగత్యం వలన ప్రజలు తరింతురుగాక.”

ప్రాచీన సంస్కృతినంతటినీ పునరుజ్జీవితం చేయడాన్ని మీరంగీకరిస్తారా?” అని సర్‌పాల్‌డ్యూక్స్ అను పాశ్చాత్యుడడిగాడు. జగద్గురువులిలా చెప్పారు. “శ్రేయస్కరమైన అంశాలను మాత్రమే పునర్జీవింపచేయాలి. దీనికి ప్రచారం మార్గంకాదు. కొందరు వాటినాశ్రయించి ఆదర్శంగా జీవిస్తే ఆ కార్యం నెరవేరుతుంది. ఒక నాటికి పాశ్చాత్యులు కూడా వారిననుసరించవచ్చు. అపుడు మా ప్రజలు కూడా మేల్కొని తమ ప్రాచీన సంస్కృతియొక్క విలువను గుర్తించగలుగుతారు.”

“జ్ఞానిగా రూపొందడమే జీవితానికి పరమ లక్ష్యం. జ్ఞానికి రాగద్వేషాలుండవు. నిందాస్తుతులు సమానం. అతడు బాధలతో క్రుంగడు. నీటిలో వేసిన మాను తేలికౌతుంది. అలానే జ్ఞానమనే నీటిలో వేసిన బాధలు బాధలు కాజాలవు. మోక్షమనేది మరణానంతరం పొందబడే స్థితికాదు. అది ఆత్మయొక్క సహజతత్త్వం. జ్ఞాని దీనిని తెలుసుకొంటాడు:.” జగద్గురువులయొక్క ఈ మాటలు వారికే వర్తిస్తాయి. అర్జెంటీనా నుండి వచ్చిన ఒక మహిళ ఇలా అన్నది. “ నేను స్వామిని మొదట దర్శించిన రోజు మహావిలువైనది. వారి రూపంలో ఏసుప్రభువు మరలా ఈ ప్రపంచంలో ప్రకటమయ్యారని తలుస్తున్నాను.... ఏసువలెనే స్వామి అనికేతులై, సన్యాసియై తమ ధ్యానపూజా తపోబోధలచే మానవశ్రేయస్సు కోసం కృషిచేస్తున్నారు. ” ఫ్రాంక్లిన్ అను అమెరికన్ ఇలా అంటారు, “అన్ని మతాలకూ హృదయంవంటి సన్యాసానికి సజీవ ప్రతీకయే శ్రీ స్వామీజీ.” అట్టి దివ్యమూర్తికి సమకాలికులుగా జీవించే మనమెంత అదృష్టవంతులం!

(“దత్తాత్రేయ” సావనీర్ నుంచి)


చదవండి! చదివించండీ!!

## భగవాన్ శ్రీ భరద్వాజ

**రచన: శ్రీమతి శ్రీదేవి**

వెల : రూ॥ 125-00 లు

ప్రతులు:- శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్,

M.M.Donka, Ongole-2. Ph : 08592-233271



# శ్రీ సాయి సచ్చరిత్ర



మరాఠీ మూలం: శ్రీ హేమాద్పంతు — ఏప్రిల్ సంచిక తరువాయి

స్వేచ్ఛానువాదం: పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ — అధ్యాయం - 49

శ్రీ గణేశాయ నమ:, శ్రీ సరస్వత్యై నమ:, శ్రీ గురుభ్యోన్నమ:,

శ్రీ కులదేవతాయై నమ: శ్రీ సీతారామచంద్రాభ్యాం నమ: శ్రీ సద్గురు సాయినాథాయ నమ:



ఒకసారి భక్త మహల్సాపతి, నానాసాహెబ్ చందోర్కర్ మశీదులో కూర్చుని వున్నారు. అప్పుడొక అద్భుతం జరిగింది. శ్రోతలు శ్రద్ధగా ఆలకించండి (147). అప్పుడు ఒక శ్రీమంతుడైన భక్తుడు సాయిని దర్శించాలని కుటుంబసమేతంగా వచ్చాడు. అతడు వైజాపుర నివాసి (148). అతని కుటుంబంలోని స్త్రీలు గోషాలో వున్నారు. వారిని చూసిన నానాకు మనసులో సంకోచం కలిగింది. తాను అక్కడ వుంటే ఘోషా స్త్రీలకు యిబ్బంది కలుగుతుందని తలచి తాను వెళితే బాగుంటుందనుకున్నాడు (149, 150). అతడు లేవబోతుంటే బాబా అతనిని వారించి యిలా అన్నారు. "వచ్చేవారు వస్తారులే. నువ్వు నిశ్చింతగా కూర్చో!" (151). ఇంతలో బాబా చెంతకు వెళ్ళడానికి సంకోచిస్తున్న ఆ గృహస్తునికి అక్కడ వున్నవారు చెప్పారు : "అక్కడ కూర్చున్నవారు (నానాసాహెబ్) గూడా బాబా దర్శనార్థమే వచ్చారు. మీరు నిరభ్యంతరంగా దర్శనానికి వెళ్ళవచ్చు." అప్పుడు వాళ్ళు వచ్చి బాబాకు నమస్కారం చేసుకున్నారు (152). వారిలో ఒక స్త్రీ తన మేలిముసుగు తొలగించి బాబాకు నమస్కారం చేసుకున్నది. ఆమె అద్భుత సౌందర్యాన్ని చూసిన నానా సాహెబ్ మనసు చలించింది (153). ఆ సౌందర్యాన్ని మళ్ళీ చూడాలని అతని మనస్సు తహతహలాడింది. కానీ బాబా ఎదుట అలా చూడటానికి అతనికి ధైర్యం చాలలేదు. (154, 156). అతని మానసిక పరిస్థితికి సిగ్గుపడి అతడు తలవంచుకు కూర్చున్నాడు. కానీ సర్వాంతర్యామి అయిన సాయికి తెలియనిదేమున్నది? ఆ చపలత్వం నుండి అతని మనస్సును స్థిరపచడానికి బాబా అతనికి ఏమి ఉపదేశమిచ్చారో శ్రోతలారా జాగ్రత్తగా వినండి (157). అప్పుడతనితో బాబా యిలా అన్నారు, "నానా, మనసులో ఎందుకు కలవరపడుతున్నావు? ఇంద్రియాలు వాటి ధర్మాన్ని సక్రమంగా నిర్వహిస్తున్నప్పుడు వాటిని ఆటంక పరచవలసిన అవసరమేమున్నది? అందువలన హానీ ఏమీ కలుగదు (158). బ్రహ్మదేవుడు సృష్టికర్త. అతని సృష్టిలోని కళాకౌశలాన్ని మనం కుతూహలంతో చూసి ఆనందించకపోతే ఆ కౌశలం వ్యర్థమైపోతుంది. మనస్సు క్రమక్రమంగా స్థిరత్వం చెందుతుంది (159). ముఖద్వారం తెరిచివుండగా దొడ్డిదోవన వెళ్ళడమెందుకు? అంతఃకరణ నిర్మలంగా వున్నప్పుడు ఎటువంటి సంకటం వుండదు (160). మనసులో చెడుతలంపులు లేనపుడు భయపడనవసరం లేదు. నేత్రాలు వాటి కర్తవ్యాన్ని నిర్వహించనీ, అందులో బిడియపడవలసిన అవసరమేమున్నది?" (161).

మాధవరావు (శ్యామా) గూడా అక్కడే వున్నాడు. అతనికి బాబా మాటలు అర్థంకాలేదు. అతనిది పరిశీలనాత్మక స్వభావము. అందుకని బాబా మాటలలోని అర్థమేమిటని జిజ్ఞాసతో నానానడిగాడు (162). అప్పుడు నానా అతనితో, "ఇప్పుడు మట్లాడకు, వాడాకు తిరిగి వెళ్ళేటప్పుడు చెబుతాను." అన్నాడు (163). యోగక్షేమ సమాచారాలనంతరం

సాయిబాబాకు నమస్కారం చేసుకుని నానా తన బసకు బయలుదేరాడు. శ్యామా అతనిని అనుసరించాడు (164). అతడు వెంటనే నానా నడిగాడు. "నానా! 'అంతా క్రమక్రమంగా సరి అవుతుంది', అన్న బాబా మాటలకు అర్థమేమిటి? స్పష్టంగా తెలియజేయి" అన్నాడు (165). కానీ అతనికి సమాధానం చెప్పడానికి నానా మనస్సు అంగీకరించడం లేదు. ఆ విషయాన్ని మరిపించడానికి ఏదో ఒకటి చెప్పాడు. దానితో మాధవరావు సమాధాన పడక యింకా ఆసక్తి పెరిగి తిరిగి తిరిగి అడగసాగాడు (166). ఇక నానాకు చెప్పక తప్పలేదు. అప్పుడతను జరిగినదంతా మనసు విప్పి విపులంగా చెప్పసాగాడు (167).

శ్రీ సాయిబాబా ఎంతటి సమర్థుడు? ఎవరి మనస్సు ఎటు మళ్ళినా వారికంతా ప్రత్యక్షమే. ఆయన అంతస్సాక్షి కదా! (168). ఇటువంటి వింతైన విషయం వింటే శ్రోతలాశ్చర్య పోతారు. ఇందులోని అంతరార్థాన్ని గమనిస్తే అత్యంత విలువైన స్థైర్యము, శాంతి లభిస్తాయి (169). మనస్సు సహజంగానే చంచల స్వభావం కలది. దానిని స్వేచ్ఛగా వుండనివ్వగూడదు. ఇంద్రియాలు విషయాలపై ప్రసరించినా, శరీరాన్ని అదుపు తప్పనీయరాదు (170). ఇంద్రియాలను నమ్మగూడదు. విషయ భోగాలపట్ల లాలస వుండగూడదు. మెల్ల మెల్లగా అభ్యాసం చేసినట్లయితే మనో చాంచల్యం తగ్గుతుంది (171). మనం యింద్రియాలకు అధీనం కాకూడదు. అవి ఎప్పుడూ అదుపులో వుండవు. కనుక మనం వాటిని ప్రయత్న పూర్వకంగా సమయ సందర్భాన్ని బట్టి అదుపులో పెట్టాలి (172). రూపమనేది దృష్టికి సంబంధించిన విషయము. అందమైన వాటిని నిర్భయంగా చూడాలి. అందులో సిగ్గుపడవలసిన అవసరమేమున్నది? కానీ మన మనస్సులో చెడు తలంపులను అవలోకించాలి. అప్పుడు యింద్రియాలు సహజంగానే నిగ్రహించబడతాయి. అప్పుడు విషయాల పట్ల లాలస వుండదు (174). రథాన్ని కోరిన స్థలానికి తీసుకు వెళ్ళడానికి సారథి మూలకారకుడెలా అవుతాడో అలాగే యింద్రియాలను విషయాలవైపు ఆకర్షింపబడకుండా చేయడంలో బుద్ధి ఎల్లప్పుడూ జాగరూకతతో వుంటుంది (175). సారథి రథాన్ని ఏ విధంగా అదుపులో వుంచుకుంటాడో అదే విధంగా బుద్ధి మనస్సును, శరీరాన్ని అదుపులో వుంచుతుంది (176). ఇంద్రియాలు, మనస్సుతో కూడిన శరీరాలను జీవులు ధరిస్తాయి. విషయ భోక్తృత్వం సమాప్తమవ్వగానే జీవులకు పరమపదం ప్రాప్తిస్తుంది. అలా చేయగల సామర్థ్యం బుద్ధిదే (177). శరీరము రథము, ఇంద్రియాలు గుర్రాలు. అవి శబ్ద, రూప, రసాది విషయాలవెంట పరుగెత్తుతాయి (178). విషయాభిలాష ఏ మాత్రం వున్నా అది పారమార్థిక సుఖాన్ని నాశనం చేస్తుంది. కాబట్టి దానిని పూర్తిగా నశింపజేయాలి. అప్పుడే మోక్షం ప్రాప్తిస్తుంది (179). అలాగాక బాహ్యేంద్రియాలను అరికట్టినప్పటికీ అంతఃకరణలో విషయాసక్తి కలిగివుంటే జనన మరణాలు అంతం కావు. ఎందుకంటే విషయాలు అత్యంత అనర్థ దాయకాలు (180). వివేకవంతుడైన సారథి మనస్సనే పగ్గాన్ని పట్టుకుని, యింద్రియాలనే అశ్వాలు స్వప్నంలోనైనా చెడుమార్గంలో వెళ్ళకుండా నియంత్రిస్తాడు (181). అలా మనస్సును శాంతింపజేసే నిగ్రహవంతుడు, దక్షుడు, కుశలుడు, చతురుడు అయిన సారథి అదృష్టం కొద్దీ లభిస్తే యిక విష్ణుపదం దూరంగా ఎందుకుంటుంది? (182). అదే పరబ్రహ్మపదం. అదే సర్వోత్కృష్టమైన పరమపదం. అదే పరాత్పరుని పరంధామం (183).

ఇప్పటికి యీ అధ్యాయం సమాప్తమైనది. రాబోయే అధ్యాయం మరింత మధురమైనది. భక్తుల మనస్సులను రంజింపజేస్తుంది. నిదానంగా శ్రవణం చేయండి (184). చివరగా హేమాద్పంతు యీ జగత్తును నడిపించువాడు, బుద్ధిని ప్రేరేపించువాడు అయిన సద్గురువు యొక్క చరణాలపై తన శిరస్సునుంచుతున్నాడు (185). స్వస్తిశ్రీ సంత సజ్జన ప్రేరితమైన, భక్త హేమాద్రపంతు విరచితమైన శ్రీ సాయి సచ్చరితనందలి 'సాధు పరీక్షణ-మనో నిగ్రహము' అను నలుబది తొమ్మిదవ అధ్యాయం సమాప్తము.

---

- సశేషం



# శ్రీ దత్తలీలామృతము

## (శ్రీ దత్తాత్రేయస్వామి చరిత్ర)



ఏప్రిల్ సంచిక తరువాయి - శ్రీమతి శ్రీదేవి



"దేవా! నీవు నిత్యుడవు. ఆనందస్వరూపుడవు. ప్రజ్ఞాన ఘనుడవు. అనంతుడవు. స్వప్రకాశుడవు. అట్టి నీయందు అనృతము, జడము, దుఃఖము, స్వప్నతుల్యము అయిన యీ అవేషజగము మాయ వలన తోచి వాస్తవము వలె స్ఫురించుచున్నది. అట్టి నీకు నమస్కారములు. ఈ విశ్వమంతయు మనఃకల్పితము. చైతన్యమొక్కటే మాయాగుణముల వలన యీ విధంగా నానా రూపములలో కన్పిస్తూ వున్నది. నీ సంకల్పం చేతనే యీ సృష్టిక్రియా కలాపములన్నీ సంభవిస్తున్నాయి. నీవే ఆధారభూతుడవై లేనిది వున్నట్లు భాసింప జేస్తూ క్రీడిస్తూ వున్నావు. స్వామీ! జగన్నియంతా! నీకు వేనవేలు నమస్కారములు. ఓ దేవ దేవా! జాగ్రత్ స్వప్న, సుషుప్త్యవస్థలన్నీ కూడా పరమాత్మవైన నీ మాయకల్పితములని మునులు తలచారు. వారు అనుమాన, ప్రమాణ, గురూపదేశములు అనే పదునైన జ్ఞానఖడ్గంతో హృదయాహంకార గ్రంథిని ఛేదించి పరగురుడవైన నిన్ను శరణుజొచ్చారు. స్వామీ! నీవు శరణాగత వత్సలుడవు. కనుక అటువంటి వారి సంసార దుఃఖములను పోగొట్టి, జ్ఞానమిచ్చి ముక్తిని ప్రసాదించే పరమగురుడవు. త్రిగుణ మాయా నియంతవు. గోవిందుడవు. అచ్యుతుడవు. అజుండవు. పరేశుడవు. తండ్రీ నీకు నమస్కారములు. నిత్యముక్తుడవు, పరిశుద్ధుడవు, విబుద్ధుడవు, ఈశ్వరుడవు, సర్వదేవ రక్షకుడవు అయిన నిన్ను దేహేంద్రియ, ప్రాణ, విషయ లోలుడవైన నేను శరణుజొచ్చాను. నన్ను మాయా ముక్తుడను జేసి రక్షించ వేడుకొనుచున్నాను. స్వామీ! ఎవని యందైతే యీ మాయా జనితమైన విశ్వము ప్రకాశిస్తున్నదో అట్టి నీకు వందనములు. స్వామీ! యీ సంసారభిలమందు సుఖమున్నదని చంకలు గొట్టుకొనుచు వచ్చిపడి కాలసర్పముచే కరువబడి తపించిపోతున్నాను. స్వామీ! అపవర్గవాగామృతము చల్లి నన్నుద్ధరించు, స్వమాయచే యీ విశ్వమును సృజించి, నియమించు నీ యిచ్చను బ్రహ్మాదులే ఎరుగలేదు. ఇక కర్మబద్ధులమైన మేము ఏ విధంగా తెలుసుకొనగలము? ఘోర సంసార మార్గమందు చిక్కి తాపత్రయములచే మలమల మాడిపోవుచున్న నాకు నీపాద ద్వంద్వాతపత్రము, వాగమృత వర్షముకాక మరొక దిక్కులేదు. విశ్వేశ్వరా! విశ్వమూర్తే! మహాపురుషులకు విమృగ్యంబగు భవద్భక్తియోగంబును, వైరాగ్యవిజ్ఞానయుతంబగు విశుద్ధవిపులజ్ఞానంబును ప్రసాదించు. ఓ వైకుంఠధామా! నీవు ధర్మోపదేశమునకు యోగప్రచారమునకు, ముముక్షువులకు జ్ఞానవిభవము నొసగుటకు అవతరించినట్టివాడవు కదా! నా ప్రార్థన నాలకించి నాకు జ్ఞానభిక్షపెట్టమని వేడుచున్నాను.

స్వామీ! అనర్థావహమైయీ శరీరము నుండి మోక్షము పొందే విధానమునెరుగక సంసార సాగరములో కొట్టుమిట్టాడే జనులను త్వరిత గతిన ఉద్ధరింపదలచి నీవు ఎన్నో అవతారములెత్తుచున్నావు. సత్త్వగుణముతో దేవతలను, రజోగుణముతో మానవులను, తమోగుణముతో భూతగణములను సృజించి నీవు గుణ నియామకుడవు, కూటస్థుడవు, ఆదిపురుషుడవు, జగదీశ్వరుడవు అయి వుందువట! అటువంటి నిన్ను మందబుద్ధులమైన మేము తెలిసికొనలేకున్నాము. నిన్ను భజించే భక్తులను వివిధ రీతుల అనుగ్రహించు దయామయుడవు. కోరికలతో నిన్ను ఆరాధించే సకాములకు వారి కోర్కెలు తీర్చి అష్టైశ్వర్యముల నొసగుచున్నావు. కేవలము నిన్ను చేరుకొనాలనే తపనతో నిరంతరము నీ పాదముల నర్చించే నీ భక్తులకు శాశ్వత కైవల్యపదమును ప్రసాదిస్తున్నావు. ఇప్పటి వరకు నేను మందబుద్ధితో భోగములలో మునిగిపోయాను. అశాశ్వతములైన, భార్యాబిడ్డలు, బంధుమిత్రులు, సేవకులు, అశ్వములు, గజములు, రథములు, వస్తు వాహనములు – యీ రాజభోగములు – వీటి మాయలో పడి మోసపోయాను. వీటిపై నాకు విసుగు జనించింది. ఈ వైభవములపై నేనిపుడు విరక్తుడనైనాను స్వామీ! ఇంక నాకివేవీ వద్దు. నాకు నీ పాదధూళి ప్రసాదించు. అది చాలు.

ఓ దేవదేవా! నాదొక సందేహమున్నది. దానిని తీర్చ మీరే సమర్థులు. ఈ ప్రపంచం గురించి సిద్ధులు, విజ్ఞులు ఏమని అంటారంటే – యిదంతా మాయాజనితమైన మనస్సు యొక్క భ్రమవలన లేనిది వున్నట్లుగా ఎండమావిలోని నీరులాగా సత్యముగా వున్నట్లు తోస్తున్నదని అంటారు. కానీ, స్వామీ మాయామయమే అయితే యీ జగత్తు యింత స్పష్టంగా ఎలా కన్పిస్తున్నది? నిన్ను శరణు పొందిన నా సంశయము బాప వేడుచున్నాను.

స్వామీ! ఈ సృష్టి మిధ్య అని ఎరుగక యింద్రియాలను తృప్తిపరచడానికే నా సమయాన్నంతా వెచ్చించాను. యౌవనం వచ్చినది మొదలు విషయ సుఖాలననుభవిస్తూ జీవితమంతా గడిపాను. ఎంతకాలం భోగభాగ్యాలనుభవించినప్పటికీ నా మనస్సు తృప్తి చెందలేదు. నాకు విరక్తి కలుగలేదు. స్వామీ! నాకు ఒక విషయం ఆశ్చర్యంగా వున్నది. ద్వైతులు, కర్మలంపటులు, చివరకు పశుపక్ష్యాదులు కూడా సత్సంగము వలన దుస్తరమైన భవసాగరాన్ని దాటగలిగారు. కానీ, క్షత్రియుడనైవుండి, నీ పాదారవిందములను సేవించి కూడా విరక్తుడను కాలేకపోయానంటే నేను ఎంతటి దురదృష్టవంతుడనో కదా! ఛీ! చీ! రాజభోగాల మత్తులో పడి ఎదటు నున్న మృత్యువును గుర్తించలేక పోయాను. ఇంతకాలానికి నాకు నా దురదృష్టకర స్థితి కొద్దికొద్దిగా తేట తెల్లమౌతున్నది. స్వామీ! సర్వ సర్వం సహా చక్రవర్తినై ఏకచ్ఛత్రాధిపత్యంగా రాజ్యమేలుచున్నానని గర్వించానే గానీ అజ్ఞానపు మత్తులో చిక్కుకుని కాలం గడుపుతున్న నా దీన స్థితిని గుర్తించలేక పోయాను. ఇప్పటికి కళ్లు తెరిచాను. స్వామీ! మానవుని అజ్ఞానంలో ముంచివేసే యీ ప్రాపంచిక సుఖభోగాల పట్ల యిప్పుడు నాకు భయం కలుగుతున్నది. ఎంతటి వారినైనా మాయలో బంధించివేసే యీ ఆశావ్యామోహాలకు భయపడినట్లుగా నేను శత్రువులకు గానీ, యమరాజ దండమునకు గానీ చివరకు మృత్యువుకు కూడా భయపడనేమో! అయినప్పటికీ స్వామీ! ఎంతటి పాపాత్ములయినా, దీనులయినా నిన్ను శరణు పొందిన వారిని కృతార్థులుకాకుండా ఏశక్తీ అడ్డుకోలేదన్నది పరమసత్యం. నీవు శరణాగత రక్షకుడవు. దయాసముద్రుడవు. నీకన్న గొప్పదైవం వేరెవరున్నారు? అందువలన యీ సామ్రాజ్య వైభవము లన్నింటినీ విడిచిపెట్టి నీ పవిత్ర పాద పద్మాలపై శిరస్సునుంచి, దివ్యానందాన్ని పొందాలని నామనస్సు తహతహలాడుతున్నది. నీ పాద సంస్మరణపై ప్రీతి లేనివారికి విషయ సుఖాలపై మక్కువ వుంటే వుండవచ్చునేమో! నాకు మాత్రం నీ సన్నిధి భాగ్యమే నిజమైన సౌఖ్యంగా తోస్తున్నది. దేవా! ఇప్పటికైనా నీ అనుగ్రహము నిండుగా నాపై కురిపించు. నీ వచనామృతముతో తప్ప యింక నాకు ఏ విధముగాను తృప్తి, శాంతి లభించవు. ఓ విభూ! నీవు సార్వభౌమత్వముగానీ, స్వర్గ, పాతాళాది

పదునాలుగు లోకాల ఆదిపత్యం గానీ, చివరకు పారమేష్ఠ్యము యిచ్చినా, వాటిని స్వీకరించాలన్న ఆశ నాకు లేదు. ఓ ఆర్తజన రక్షకా! మాయామయము, వాసనామయము అయిన యీ నా అహంకార గ్రంధిని నీ సద్బోధలనే నిశిత ఖడ్గాలతో మొదలంటా కోసివేయ ప్రార్థిస్తున్నాను. విశుద్ధవిజ్ఞానఘనుడవు, సదానందుడవు, లీలా గృహీత విమల కాంచన దేహుండవు, పురాణ పురుషుండవు అగు నీకు మ్రొక్కెద. అరవింద నాభ! మాయామోహితులై నీ పాదారవింద విముఖులైన అజ్ఞానులను కూడా ఉద్ధరించుటకు నీవు అవతరించావని విన్నాను. కానీ నీ పాదధూళి శిరస్సున దాల్చి సేవించే నావంటి వారిని కూడా యీ ఆశావ్యామోహాదులు విడువక పోవటం ఆశ్చర్యంగా వుంది. పూర్వం అత్రిమహాముని అనసూయాదేవితో కలసి తపస్సు చేయగా వారికి నీవు ప్రత్యక్షమై వారి కోర్కె మేరకు నీవు వారి పుత్రుడవైనావు. అంతటి దయాశాలివి, వరప్రదాతవు అయిన నీకు నామొర ఎందుకు విన్పించటం లేదు? వేదాంతులు నిన్ను గురించి ఏమంటారంటే కన్నులు లేకున్నా చూడగలవనీ, చెవులు లేకున్నా వినగలవనీ, నిరాకారుడవు, నిష్క్రియుడవు అయివుండి కూడా సకల సృష్టినీ శాసిస్తావనీ అంటారు. కానీ ఓ పరమాత్మా! ఇపుడు నీవు సాకారుడవై మాముందు నిలచివున్నావు. లీలా గ్రహీత శరీరుడవై మమ్మును గ్రహించిన స్వామీ! భవసాగరములో మునిగి వున్న నన్నుద్ధరించు. నాకు నీవుతప్ప వేరు దిక్కు లేదు. నీ పాదసేవకుడను, నీ భక్తుడను నన్ను రక్షించు.

శ్లో॥ నమస్తే పుండరీకాక్ష! నమస్తే పురుషోత్తమ!
నమస్తే విశ్వ వంద్యాంఘ్రే! నమస్తే యోగినాంవర!

శ్లో॥ నమస్తే వాసుదేవాయ! నమస్సంకర్షణాయచ!
ప్రద్యుమ్నాయానిరుద్ధాయ! యోగి వంద్యాయతే నమః ॥

శ్లో॥ నమస్తే పద్మనాభాయ! నమస్తే జలశాయినే!
నమస్తే హృషీ కేశ! పాహిమాం వృజినార్ణవాత్ ॥

శ్లో॥ నమోనంతాయ సూక్ష్మాయ సర్వాధ్యక్షాయ సాక్షిణే ।
మనోగిరాం విదూరాయ! భక్తావాసాయతేనమః ॥

శ్లో॥ నమః పంకజనాభాయ! నమః పంకజమాలినే ।
నమః పంకజనేత్రాయ! నమస్తే పంకజాంఘ్రయే ॥

శ్లో॥ ప్రసీద పరమానంద! ప్రసీద పరమేశ్వర ।
ఆధి వ్యాధి భుజంగేన దష్టం మా ముద్ధర ప్రభో ॥

స్వామీ! దత్తాత్రేయ దేవా! శరణా గత వత్సలా! భవరోగమనే సర్పముచే కఱువబడిన నన్ను దయతో రక్షించు – అంటూ పరిపరి విధముల ప్రార్థించాడు. కానీ స్వామి కన్నులు తెరవనే లేదు. కార్తవీర్యుడు ఖిన్నుడైనాడు. “స్వామి తన మొర ఎందుకు వినలేదు? తనను కరుణించి కనులు తెరచి ఆప్యాయంగా పలుకరించని కారణమేమిటి?” అని ఆలోచిస్తూ ఎంతగానో చింతిస్తూ చేతులు జోడించి స్వామి ఎదుట నిలుచుండిపోయాడు. అప్పటికి రాత్రి చాలా భాగం గడిచిపోయింది.

ఆ రాత్రి యింక ఒక్క జాము మాత్రమే మిగిలివున్నది. పవిత్రమైన ఆ నాల్గవ జాములో ఆకాశమార్గం అంతా ఎంతో సందడిని సంతరించుకొంది. వేల కొలది సిద్ధ పురుషులు ఆకాశంలో ప్రయాణిస్తూ సహ్యాద్రి చేరుకొని నేలకు దిగి చేతులు జోడించి స్వామి సన్నిధి చేరారు. వారంతా స్వామికి సాష్టాంగ నమస్కారాలాచరించారు. స్తోత్రములు

చేశారు. స్వామి దర్శనంతో సంతృప్తులై వచ్చినదారినే తిరిగి వెళ్లిపోయారు.

ఆ తర్వాత ఎందరో సిద్ధులు, యోగులు వేలాది మంది సహ్యాగుహలనుండీ అన్ని దిక్కులనుండి ఆకాశ మార్గంలో పయనించి స్వామిసన్నిధి చేరారు. వారంతా స్వామికి సాష్టాంగనమస్కారము లాచరించి,

జయ మహాదేవ జయ యోగ విదాంవర!

జయ ఆధ్యాత్మ దృగవ్యక్త జయాత్రి కులదీపక!!

అని పొగడుచూ, కీర్తించుచు ఆకాశమార్గాన తిరిగి వెళ్లిపోయారు. అటు తర్వాత సహ్యాచలంపై నివసించే వాన ప్రస్థులు, సన్యాసులు, హంసులు, వేదవేదాంగపారంగతులైన విప్రులు, శ్రౌతకర్మరతులు అనేకులు గుంపులు గుంపులుగావచ్చి స్వామికి సాష్టాంగనమస్కారము లాచరించి, బుక్కులతో, స్తోత్రమొనర్చి తమ నిత్య విధులాచరించేందుకై తిరిగి వెళ్లి పోయారు.

ఆ తర్వాత కొంతసేపటికి స్వామి కనులు తెరచారు. తూర్పు దిక్కు అరుణవర్ణంతో మెరిసిపోతూ భాస్కరుని రాకకై నిరీక్షిస్తూ నీరాజనాలతో ఆహ్వానం పలుకుతున్నది. భూమి, ఆకాశం క్రమక్రమంగా తెల్లని వెలుగులు నింపుకొంటున్నాయి. అజ్ఞానపు చీకట్లు అంతరించిపోతున్నాయి.

స్వామి ఆసనమునుండీ లేచి నైఋతీ దిశగా నడచి వెళ్లారు. శిష్యుడైన శాంతతపుడు అందించిన మృత్తిక (మట్టి), జలము (నీరు) లతో బాహ్య విధులు నిర్వర్తించుకొన్నారు. సత్యవాక్కుడను ముని అందించిన పూర్ణజలకమండలము (నీటితో నిండిన కమండలం), దంతకాష్టము (దంతములు శుభ్రపరచుకొనే పుల్లలు) లతో ముఖప్రక్షాళనముగావించి సరిత్తీరము చేరుకొన్నారు. స్వామి వెంట వేదవిదుడు అను మునీశ్వరుడు గోమయము, భస్మము, మృత్తుకుశలు, వల్కలములు (దుస్తులు) తీసుకుని స్వామిని అనుసరించి వెళ్లాడు. స్వామి విధి పూర్వకముగా స్నానము చేశారు. దేవ, ఋషి, పితృ తర్పణము లాచరించారు. సూర్యోపాసన గావించి, జపము చేసుకొన్నారు. మధ్యాహ్న విధులైన ఆహ్నికములు నిర్వర్తించుకొని కొల్హాపురమునకు వెళ్లి అక్కడ లక్ష్మీదేవి వద్ద భిక్ష స్వీకరించి, భుజించి, ముహూర్తకాలంలో తిరిగి సహ్యాద్రిచేరి తన ఆసనముపై ఆసీనులయ్యారు.

స్వామి రాకకై వేచిచూస్తున్న అనేకులయిన నయోగులు, మునీశ్వరులు స్వామిని చూసి పరమానందంతో

**- సశేషం**


చదవండి! చదివించండీ!!

శ్రీ సంహితాయన గురుద్విసాహస్రి

సంస్కృత మూలము : శ్రీ వాసుదేవానంద సరస్వతీ

తెలుగు : ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

వెల : రూ।। 80-00 లు

ప్రతులు:- శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్,

M.M.Donka, Ongole-2. Ph : 08592-233271

# వార్తాలాపము

ఏప్రిల్ సంచిక తరువాయి (సీరియల్)

## దైవసంపదను పొందుటచే ముక్తి కలుగును

స్వాప్ర :- ఆచార్యుల మతములన్నియు అధికారిభేదముచే యుక్తములే. కనిష్ఠుడగు మందాధికారికి ద్వైతము తగినది. మధ్యమాధికారికి విశిష్టాద్వైతము యోగ్యమైనది. ఉత్తమాధికారికి అద్వైతము గ్రహించదగినది. ద్వైతాద్వైతవిశిష్టాద్వైతములయందు దేనిని అవలబించినను మతమతాంతరముల వివాదములయందు చిక్కుపడి, ఖండనమండనములు చేయుచు, యథార్థవస్తువునకు అనగా పరమాత్మునకు సంబంధించిన జ్ఞానమును పొంది సత్యధ్యేయమును చేరుటకు ప్రయాసపడకపోయినచో నిరర్థకము. ఏ మతమైనను అవలంబించుడు. అన్ని మతముల అభిప్రాయము కూడ రాగద్వేషాదులను నిర్మూలించి, భక్తి, వైరాగ్యములను పొంది ఒకే పరమాత్ముని పొందుటయే. నదులన్నియును సముద్రమున చేరునట్లు ఒకే పరమాత్ముని పొందుటయే సర్వమతముల యొక్కయు ఆశయము. ఈ ఆశయముతో నేను ద్వైత, అద్వైత, విశిష్టాద్వైతములను అన్నిమతములును కూడ అపదార్థ ప్రతిపాదితములగుటచే త్యాజ్యములని తలచితిని. ద్వైతసాపేక్షము అద్వైతము. అద్వైతసాపేక్షము ద్వైతము. ఈ రెండును వాస్తవిక రూపమున కల్పితములే. మతమతాంతరముల గందరగోళములో రాగద్వేషములు కలుగును. అష్టావక్రగీతయందు చెప్పబడినది.

నానామతం మహర్షీణాం సాధూనాం యోగినాం తథా ।
దృష్ట్వా నిర్వేద మాపన్నః కో న శామ్యతి మానవః ॥

"మహర్షుల మతములు అనేకములు, సాధువులకును, యోగులకును వేర్వేరు మతములు కలవు చూచిన తదుపరి, వారి భేదములపై వైరాగ్యము కలిగిన ఏ మానవుడు శాంతిని పొందడు?"

మతమతాంతరములను గురించి అలర్కుని దృష్టాంతము కలదు. మదాలస నాల్గవకుమారుడు అలర్కుడు. తల్లి ఇచ్చిన తావీదునుండి చదివిన ఉపదేశముచే వైరాగ్యమును పొందెను. అతడు తన పెద్ద అన్నగారగు సుబాహునివద్దకు వెళ్లి ప్రార్థించెను. "నాకు బ్రహ్మవిద్యను ఉపదేశించుడు." అతడు చెప్పెను. "నీవు దత్తాత్రేయగురువుల వారి వద్దకు వెళ్ళుము. ఆయన నిష్పక్షపాతి. నేను నీ సోదరుడను. నేను ఇచ్చిన ఉపదేశము బోధపడదు." అలర్కుడు వెంటనే దత్తాత్రేయుల వారిని వెదకుటకు బయలు దేరెను. ఒక బంగారు ఉంగరమును వ్రేలునకు ధరించి గురునన్వేషించుటకు బయలువెడలెను. ఆయనను తెలిసికొనుటకు ప్రముఖవ్యక్తులను ఇట్లు ప్రశ్నించెను. "ఈ ఉంగరము దేనితో చేయబడినది?" బంగారముతో చేయబడెనని వారు చెప్పెడివారు. అలర్కుడు "కాదు ఇత్తడిది." అని పలికెను. మరియొకనికి "వెండిది" అని చెప్పెను. ఇట్లు అందరకును వారు చెప్పిన సమాధానములను అంగీకరించక వేర్వేరు ప్రతిసమాధానములు చెప్పెను. అంతట వారు "వేరొకచోటికి పొమ్ము. నీకు మతి లేదు" అని చెప్పెడి వారు. చివరకు అలర్కుడు దత్తాత్రేయులవారివద్దకు వచ్చెను. వారిని కూడ "ఈ ఉంగరము దేనితో చేయబడిన" దని అడిగెను. ఆయన సమాధానము చెప్పెను. "బంగారపు ఉంగరము".

అలర్కుడు :- "కాదు. వెండిది."

దత్తాత్రేయుడు మరల చెప్పెను :- "అవును"

అలర్కుడు పలికెను :- "కాదు, ఇత్తడిది."

దత్తాత్రేయుడు :- "అవును".

అలర్కుడు ఆవిధముగా ఎన్నిమార్లు వ్యతిరేకముగా చెప్పినను దత్తాత్రేయులు "నిజమే" అనెను. ఈ

సమాధానములచే "ఆయన దత్తాత్రేయులే" అని తెలిసికొనెను. ఆలర్కుడు ఒక్కమారుగా వారి కాళ్లపైబడి పలికెను. "ప్రభూ, నేను ఎన్నిమారులు వంకరసమాధానములు చెప్పినను తమరు నిజమనియే చెప్పిరి. అందుకు కారణమేమి?" దత్తాత్రేయులవారు పలికిరి. "నీవు వేరువేరు ధాతువుల పేర్లు పలికితివి. అందుచేతనే నేను ప్రతిసమాధానమునకును నిజము, నిజము అని చెప్పితిని. ఏలనన నా దృష్టియందు వెండి, బంగారము, ఇత్తడి మొదలగు ధాతువులన్నియును పార్థివములే. ఆ కారణముచేతనే నేను ప్రతిమారును "అది నిజమే" అని చెప్పితిని.

ఈ దృష్టాంతముచే మతమతాంతరముల లక్ష్యమగు జ్ఞానము ఒకటే అని తేలుచున్నది.

స్వా. ని. :- దత్తాత్రేయులు ఇట్లు పలికిరి.

బోధవిబోధైఃసతతం యుక్తో ద్వైతాద్వైతైః కథమిహో ముక్తః ।

సహజో విరజాః కథమిహ యోగీ శుద్ధనిరఞ్జన సమర సభోగీ ॥

"పరోక్ష, అపరోక్ష జ్ఞానములతో కూడినవాడు ద్వైతాద్వైతముక్తుడని ఎట్లు చెప్పబడును? ఏలనన అతడు ద్వైత, అద్వైతములకు రెంటికిని పరుడు. ఆతడు సహజముగా త్రిగుణాతీతుడు. ఆతడు యోగి ఎట్లు అనబడును? అతడు శుద్ధ నిర్లిప్త సమరస ఆనందమును అనుభవించును."

స్వామివారు చెప్పినది నిజము. మతమతాంతరములను త్యాజ్యముగా నంగీకరించి వదలివేయుట యుక్తము. ప్రతివాడును జ్ఞానమును సంపాదించుట అను పురుషార్థమును చేయుటయే కర్తవ్యముగా నెరుంగవలెను.

చందూభాయి ప్రశ్నించెను.

"జ్ఞానముయొక్క వాస్తవిక స్వరూపమేమి?"

స్వా. ని. :- జ్ఞానము రెండు రకములు. పరోక్షము. అపరోక్షము. "బ్రహ్మము కలదు." అను జ్ఞానము పరోక్షజ్ఞానము. బ్రహ్మసాక్షాత్కారము అపరోక్షజ్ఞానము. కాని స్థితిభేదముననుసరించి జ్ఞానికోటిని నాలుగువిధములుగా విభజించవచ్చును. యోగ వాశిష్ఠమున ఏడు జ్ఞానభూమికలు వివరించబడినవి. అందులో మొదటి మూడును సాధకావస్థకు సంబంధించినవి. మిగిలిన నాల్గును సిద్ధావస్థకు సంబంధించినవి. ఈవిధముగనే అజ్ఞానభూమికలు కూడ ఏడు కలవు.

చందూ :- ఈ విషయమున నేను ఏమియును చదువలేదు. తమరు దయయుంచి వివరించుడు.

స్వా.ని. :- ఈ విషయమున శ్రీరామచంద్రులవారు వశిష్ఠులను ప్రశ్నించిరి.

"కీదృశ్యో భగవన్యోగభూమికాః సప్త సిద్ధిదాః ।

నమాసేనేతి మే బ్రూహి సర్వతత్త్వవిదాంవర ॥"

"ఓ తత్త్వవేత్తలలో శ్రేష్ఠుడా! సిద్ధిని ఇచ్చు ఏడుభూమికలును ఏమి? నాకు సంక్షేపముగా చెప్పడు."

వశిష్ఠ :- ఓ రామా! అజ్ఞానభూమికలు ఏడు. అటులనే జ్ఞాన భూమికలు కూడా ఏడు. వాని అవాంతరభేదములు అనేకములు. సహజమగు ప్రవృత్తిమయజీవితము, విషయభోగములయందు అంతులేని తృష్ణయనెడు రసావేశము. ఈ రెండును అజ్ఞానభూమికకు అసాధారణ కారణము. సాధానాచతుష్టయసహితముగా శ్రవణ, మనన, నిదిధ్యాసములందు ప్రవృత్తియు, తీవ్రమగు మోక్షేచ్ఛయను రసావేశము జ్ఞానభూమికకు అసాధారణకారణము. అధిష్ఠానమగు బ్రహ్మము యొక్క ఉత్కర్షకు అధీనమయిన తన అస్తిత్వోపలబ్ధి రెండు భూమికలకును సాధారణకారణము. ఈ కారణములచే రెండు రకములగు భూమికలును తమతమ విషయములయందు దృఢముగా నుండును. అజ్ఞానభూమికలు ప్రపంచమునందు దుఃఖమను ఫలమును కలుగజేయును. జ్ఞానభూమికలు సంసారభ్రమణనివృత్తితో బాటు పరమానంద ప్రాప్తి అనెడు ఉత్తమ ఫలమును కలుగజేయును.

ఓ రాముడా! మొదట ఏడురకముల అజ్ఞానభూమికలను వినుము :-

స్వస్వరూపస్థితి జ్ఞానము. దాని ఫలము ముక్తి. స్వస్వరూపస్థితి నుండి చ్యుతిని పొందుట అజ్ఞానము అనబడును. దేహాదులయందు అహంకార, మమకారములు దానిఫలము. సంతులగు జనులు శుద్ధ సన్మార్గసంవిద్రూపమగు స్వస్వరూపమునుండి అనగా నిజస్వరూపజ్ఞానమునుండి చలించరు. వారియందు రాగద్వేషములు ప్రవేశించవు. ఆ రాగద్వేషాభావముచే వారియందు అజ్ఞానముకూడ ప్రవేశించలేదు. ఒక విషయమునుండి చిత్తము మరలినతరువాతనున్న మధ్యకాలము నందలి మననరహితమగు స్థితియే స్వస్వరూపస్థితి. అందు సర్వసంకల్పములును శాంతించును. అది నిశ్చలతయను ఘనస్థితి. అది నిద్రా, జడత్వ మహితము. నిద్ర స్వరూపస్థితి అనిపించుకొనదు. ఏలనన నిద్ర అవస్థావిశేషము. అటులనే మూర్ఛయందు జడత్వము ఉండుటచే అది కూడ స్వరూపస్థితి అనిపించుకొనదు. "అహం" నశించి భేదము శమించి, స్వప్రకాశము చిత్తమున స్ఫురించిన అ స్థితిని మహాపురుషులు స్వరూప స్థితి యందురు. ఆ చైతన్య రూపమగు ప్రత్యగాత్మయందే అజ్ఞానము ఆరోపితము. ఆ అజ్ఞానముయొక్క ఏడుభూమికలను నీవు వినుము.

## ఏడు అజ్ఞానభూమికలు

1. బీజజాగ్రత్తు, 2. జాగ్రత్తు, 3. మహాజాగృత్తు, 4. జాగ్రత్స్వప్నము, 5. స్వప్నము. 6. స్వప్న జాగ్రత్తు, 7. సుషుప్తి అను ఏడురకములగు ఈ మోహము అజ్ఞానము. ఒకదానితో మరియొకటి కలియుటచే ఇది అనేకరకములగును.

1. బీజ జాగ్రత్తు :- దీని లక్షణమును వివరించెదను సృష్ట్యాదియందు మాయాబలమున నామరహితమును, నిర్మలమును అగు చిదాభాసము కల రూపము ఆవిర్భవించెను. అది భవిష్యమున ప్రాణధారణాది క్రియలు అను ఉపాధి ద్వారా చిత్తము, జీవము మొదలగు పేర్లు పొందెను. అది జాగ్రదవస్థకు బీజము. కాన అది "బీజజాగ్రత్తు" అనబడును. అది సంవిత్తుయొక్క నూతననావస్థ.

2. జాగ్రత్తు :- బీజజాగ్రత్ స్థితికి అనంతరము 'ఈ స్థూల దేహమే నేను, ఈ స్థూలశరీరమనకు సంబంధించిన భోగ్యపదార్థములు నావి' అనునట్టి పూర్వములేని అచలప్రత్యయము (జ్ఞానము) 'జాగ్రత్త' అనబడును.

3. మహాజాగ్రత్తు :- స్థూలశరీరము నేను, భోగ్యపదార్థములు నావి అని పూర్వజన్మమున ఉద్భవించి, అభ్యాసముచే వృద్ధిని పొందిన ప్రత్యయము (జ్ఞానము) 'మహాజాగ్రత్తు' అనబడును.

4. జాగ్రత్ స్వప్నము :- అభ్యాసరహితమగుచు, దృఢమయిన సంకల్పముమాత్రమే స్వరూపముగా కల జాగ్రత్థిఇయందలి మనోరాజ్యము (మనోరథములు) 'జాగ్రత్స్వప్నము' అనబడును. ద్విచంద్రప్రతీతి, ముత్యపుచిప్పయందు రజతభావము, మృగతృష్ణా భ్రాంతి మొదలగునవి కూడ జాగ్రత్ స్వప్నభేదములే. అభ్యాసముచే జాగ్రతదవస్థయందు స్వప్న సదృశమగు వ్యవహారము జరుగుటచే జాగ్రత్ స్వప్నము అనబడును.

5. స్వప్నము :- ఇది అనేక విధములు. నిద్రామధ్యమందుకాని, అంతమునందుకాని, మిథ్యాపదార్థములు స్వల్ప కాలము ప్రతీయమానములయి (కన్పట్టి) అనంతరము అదృశ్యములయి పిదప అవి సత్యపదార్థములు కావనియు, మిథ్యాభాసములనియు ప్రత్యయము కలుగుట 'స్వప్నము' అనబడును.

6. స్వప్న జాగ్రత్తు :- చిరకాలము జాగ్రదభావముచే అవికసితమును, మహచ్ఛరీర యుక్తమును, దృఢాభిమానముచేగాని చిరకాల స్థాయ్యికల్పనచేత (హరిశ్చంద్రుని కొకరాత్రి 12 సంవత్సరములుగ తోచినట్లు) గానిజాగ్రద్రూపముగ వృద్ధినొందినదియు, మహాజాగ్రత్స్థితిని బడసినట్టిదియునగు స్వప్నము 'స్వప్నజాగ్రత్తు'

అనబడును.

7. సుషుప్తి :- వెనకటి ఆరు భూమికలును కర్మభూమికలు. ఏలనన అందు కర్మఫలము అనుభవించబడును. పూర్వ జన్మకర్మము అనుభవించినతదుపరి నశించి, రెండవ కర్మ ఫలము నిచ్చుటకు అభిముఖముగా నుండనప్పడు ఆ రెంటికిమధ్య నుండు సూక్ష్మమును, స్థూలమును అగు సర్వప్రపంచమును లయమును పొందినందున దానికి కారణమగు అజ్ఞానముమాత్రమే శేషించుటచే అజ్ఞానోపాధికల జీవుని భావిదుఃఖకారణమగు వాసనాసహితమయిన జడసమమగుస్థితి 'సుషిప్తి' అనబడును.

ఈ సుషుప్తియందు తృణము, లోష్టము, పర్వతము, శిలాది సర్వపదార్థములు పరిమాణుత్వమును పొందును. ఓ రామా! ఈ విధముగా అజ్ఞానముయొక్క ఏడుదశలును వివరించితిని సముద్రమునందలి సుడిగుండమున నౌక పడినట్లు ఏడు అజ్ఞానభూమికలయందును జీవుడు ఒక మోహమునుండి మరియొక మోహమును పొందుచునే యుండును. ఈ ఏడుభూమికలును నానా వికారసంయుతములు. జీవుని మరణరూపమగు సంసారచక్రమునందు భ్రమింపజేయును. ఈ ఏడు అజ్ఞానభూమికలను పరిత్యజించవలెను. అనంతరము ముందు చెప్పబడు జ్ఞానభూమికలను విచారించినచో విశుద్ధమగు ప్రత్యగాత్మ యొక్క అపరోక్షజ్ఞానము కలుగును. అంతట నీవు వెనుక చెప్పిన అజ్ఞానభూమికలనుండి ముక్తిపొందగలవు.

## ఏడు జ్ఞానభూమికలు

ఇమాం సప్తపదాం జ్ఞానభూమిమాకర్ణయానఘ ।
నానయాజ్ఞాతయాభూయో మోహపఙ్కే నిమజ్జసి ॥

ఓ పాపరహితుడగు రాముడా! జ్ఞానముయొక్క ఏడు భూమికలును వినుము. అభ్యాసక్రమమున ఈ ఏడు భూమికలను అనుభవించిన తదుపరి నీవు మోహపంకిలమున దిగపడవు. ఈ ఏడు జ్ఞానభూమికలును తప్పక తెలిసికొనవలెను. ఏలనన వానిచే పరమపురుషార్థము సిద్ధించును. అఖండస్వరూపవృత్తిచే ఆరూఢమయిన బ్రహ్మము అజ్ఞాననివర్తక మగుటచే జ్ఞానమనబడును. కావున ఈ ఏడుభూమికలును జ్ఞాన భూమికలు అనబడును. బ్రహ్మము ఏడుభూమికలకును పరుడు. సత్యావబోధము మోక్షము. రెండును మోక్షమునకు పారిభాషికపదములు. ముక్తుడయిన జీవుడు మరల ఈ జగమున జన్మించుటకాని, మృతుడగుటకాని జరుగదు.

1. శుభేచ్ఛ, 2. సువిచారణ, 3. తనుమావస, 4. సత్త్వా పతి, 5. ఆసంసక్తి, 6. పదార్థభావిని, 7. తుర్యగ అని జ్ఞానభూమికలు, 8. ఈ జ్ఞానభూమికలను సమముగా అభ్యసించుటచే అధికారియగు నరుడు పరబ్రహ్మమును పొందును. ఆ ఆత్మస్వరూపమును పొందిన జనుడు శోకించడు.

## తరతి శోకమాత్మవిత్

1. శుభేచ్ఛ :- "నేను ఇంత ఆయుర్దాయమును జడత్వముతో వ్యర్థముగా ఏల పాడుచేయవలెను? ఇక మేల్కొని తప్పిన మార్గమనుండి మరలి సరియగు మార్గమున నడచెదను. ఈ సంసార మోహము అనెడు జంజాటమును పరిత్యజించి నా ఆత్మకళ్యాణము కొరకు శ్రోత్రియుడును, బ్రహ్మనిష్ఠుడును అగు గురువును శరణుజొచ్చి మోక్షశాస్త్రమును అభ్యసించి వారి ఉపదేశానుసారము ఆత్మవిచారము చేయుదును. ఈ విధమగు సాధనచతుష్టయసంపత్తితో కూడిన ఇచ్ఛ శుభేచ్ఛ. నిషిద్ధకర్మలను పరిత్యజించి, ఫలాసక్తి రహితమగు, విహితకర్మాచరణము ద్వారా అంతఃకరణాదిశుద్ధమును పొంది, వివేక వైరాగ్యములు, షట్

సంపత్తి, ముముక్షుత్వము అగు సాధనచతుష్టయమును సంపాదించి, ముక్తియే పరిణామము కలిగి శ్రవణాదులయందు ప్రవర్తింపజేయు ఉపాధికల ఆత్మసాక్షాత్కారము కొరకు కలుగు ఉత్కటమగు అభిలాష 'శుభేచ్ఛ' అనబడును. ఇది జ్ఞానమునకు ప్రథమ భూమిక.

2. సువిచారణ :- తీవ్రవైరాగ్యమును అభ్యసించుటతో బాటు వేదాంతశాస్త్రముల శ్రవణ, మననములయందు ప్రవృత్తిని పొంది శ్రద్ధగా సద్గురుని సేవించుట, నిర్జనప్రదేశనివాసము, భిక్షా భోజనము మొదలగు యతిధర్మములయందు ప్రవృత్తి, సద్గురూపదిష్టములగు వాక్యములను మోక్షశాస్త్రమును తరచు విచారముచేయుట 'సువిచారణ' అనబడును ఇది జ్ఞానమునకు రెండవ భూమిక.

3. తనుమానస :- శుభేచ్ఛతోను, సువిచారణతోను కూడిన శ్రవణ, మనన నిదిధ్యాసనములచే శబ్దాదిపర్యంతము అనాసక్తితో కూడిన సవికల్ప సమాధియందు అభ్యాసముద్వారా బుద్ధి సూక్ష్మత్వమును పొందును. ఇది 'తనుమానస' అను మూడవ జ్ఞానభూమిక.

4. సత్త్వాపత్తి :- ముందు చెప్పబడిన మూడు భూమికలయందును అభ్యాసముచే బాహ్య పదార్థములయందు కల రాగసంస్కారము నిర్మూలమగును. మనస్సు విషయవాసననుండి విరక్తిని పొంది శాంతించును. మాయ, మాయాకార్యములు, అవస్థాత్రయములేని కేవల శుద్ధసన్మాత్ర, చిన్మాత్ర, ఆనందఘన ఆత్మయందు త్రిపుటిని లయ మొందించి సాక్షాత్కారపర్యంతము ఉండుట అనగా నిర్వికల్పసమాధిరూపమగు స్థితి సత్త్వాపత్తి అనునది నాలుగవ జ్ఞాన భూమిక. ఈ భూమిక యందలి జనుడు బ్రహ్మవిదుడనబడును.

5. అసంసక్తి :- వెనుకటి నాలుగు భూమికల అభ్యాసముచేతను బాహ్య, అభ్యంతర ఆకారములతోను, వాని సంస్కారములతోను చిత్తమునకు సంసర్గము ఉండదు. సమాధిపరిపాక మను ఫలము కలుగును. ఈ దశయందు చిత్తమునందు పరమానందము కలుగును. నిత్య ఆపరోక్ష, బ్రహ్మాత్మభావసాక్షాత్కారము అను చమత్కారము జరుగును. ఇది 'అసంసక్తి' అను 5వ జ్ఞానభూమిక. ఇందు అవిద్యకును, అవిద్యాకార్యములకును సంబంధములేదు. కావున దానిపేరు 'అసంసక్తి' అని వచ్చినది. ఈ ఐదవభూమికయందున్న వాడు బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడు.

6. పదార్థభావిని :- పైన చెప్పబడిన 5 భూమికలను అభ్యసించుటచే స్వాత్మారామత్వము ద్వారా కలుగు బాహ్య ఆభ్యంతర పదార్థముల దృఢమగు అప్రతీతి 'పదార్థభావిని' అను భూమిక, ఇందు అన్యుల ప్రేరణచే పదార్థభావము కలుగును. వారివలననే శరీరనిర్వహణము జరుగును. ఇది ఆరవభూమిక, ఈభూమికయందున్నవాడు బ్రహ్మవిద్వరీయసుడనబడును.

7. తుర్యగ :- పై భూమికలను చిరకాలము అభ్యసించుట చేతను జాగ్రదాది అవస్థాత్రయము నుండి ముక్తిని పొందును. బ్రహ్మమును అఖండాత్మరూపమున తెలిసికొనును. ఆ భూమిక 'తుర్యగ' అనబడును. ఈ ఏడవ భూమికయందలి నరుడు బ్రహ్మ విద్వరిష్ఠుడనబడును. ఈ తురీయావస్థ జీవన్ముక్తావస్థ అనికూడ చెప్పబడును. తురీయాతీతము బ్రహ్మము. ఇది విదేహముక్తియొక్క విషయము. కావున భూమికారూపమున అది లెక్కించబడదు.

– సశేషం

# శ్రీ భరద్వాజ ప్రేమామృతము



E. Bharadwaja, M.A.
DWARAKAMAI
VIDYANAGAR
524 413

Place........
Date 26/2/79

Dear Cy Sulochana,

Baba bless you.

# శ్రీ భరద్వాజ లేఖామృతము

తేది : 26-2-79

Dear Chy. Sulochana,

Baba bless you. నీ జాబు చేరినది. నీ ఆవేదన అర్థం అయి నవ్వువచ్చింది. నిన్ననే మీ అమ్మ, చెల్లెలు శివరాత్రికొస్తే Centre వాళ్ళను నిన్నక్కడే ఉండమన్నారనీ, Small Scale Industries అనే Problem చెప్పాను.

నిన్ను వెంటనే రప్పించకపోవడానికి కారణాలున్నాయి. మొన్న నాయన మాట్లాడుతూ "ఒక్క అయ్య చేతిలో పెట్టాల; కనీసం ఒక 25 వేలన్నా కావాలి", అంటున్నాడు. అప్పుడు నేను దాని గురించి ఆలోచించవలసి వస్తుంది. నీకాలోచన అనవసరంగా పెట్టడం గదా! ఇంక నీకిక్కడికొచ్చిన శాంతి దక్కనివ్వరని ఆలోచిస్తున్నాను. అక్కడ శాంతిగా సాధన చేస్తూ బాబా సేవ చేస్తూ వస్తూ పోతూంటేనే ఎక్కువ శాంతిగా ఉంటుందని యోచన. నీవు మా యింట్లో ఉండడం, నీకు పెట్టడం సమస్యకాదు. అట్లా జరుగుతే కూడా మీ వాళ్ళను లోకం వదలదు. ఆ తాకిడికి తట్టుకోలేక నీకు వత్తిడి తెస్తారు. వీటి గురించి ఆలోచించడం దండుగ. ఈ ఆలోచన కొని తెచ్చుకోవడం ఎందుకు? బాబా Prayerలో ఉంటూంటే ఆయనే నీకు శ్రేయస్కరమైన రీతిన పరిస్థితులనేర్పరచి దారి సుగమం చేస్తాడు. కాని ఇక్కడకొస్తే మీ ఇంట్లోవారు యోచన పెడతారు. సబూరితో, నిష్ఠతో చూస్తుందాం. నేను చూస్తూనే ఉన్నాను. నేననుకున్నది March 2nd or 3rd weekలో రప్పిస్తే April 7th, మా కాలేజి క్లోజ్ చేసేదాకా నిన్నుంచవచ్చునని. శెలవులకు నేను Tpti, Hydd, వెడుతూండేప్పుడు నిన్ను మరలా పంపుతే నా Abscence feel అవకుండా ఉంటావని. అయినా మరలా యోచించి ఇంత కంటే Convenientగా ఉండే విధానం యోచిస్తాను. నాకు కూడా సాయి కుటుంబమంతా ఒకే కుటుంబంగా ఒకే చోట ఉండాలని ఉంటుంది. కాకుంటే ఆధ్యాత్మిక శ్రేయస్సు దృష్ట్యా పూర్వ కర్మ Effects Workout అవ్వాలని ఉంటుంది. మీకు మొదటిది బలంగా ఉండి రెండవదాన్ని మరచి Restless అవుతారు. నాకు మొదటి కోరిక మీకాధ్యాత్మికంగా శ్రేయస్కరం గనుక ఇష్టం. లేకుంటే ఈ జగత్తే మిధ్య అయితే యిష్టాయిష్టాలెలా ఉంటాయి? కనుక రెండవ ప్రాబ్లం Patientగా workout అవనివ్వాలని ఉంటుంది. అలా కాకుంటే ఇదే Problems, Worries ను మరుజన్మలలో కూడా Face చేస్తూండవలసి రావడం ఎందుకు? Finalగా ఈసారితో వీటిని నశింపచేయాలని ఉంటుంది. బాగా ఆలోచించి నీకేది మంచిదో నేను బాగా ఎరుగుతాను. డాక్టర్‌వలే Temporary Pain అయినా Treatment వల్ల Long Health వచ్చేప్పుడు చేయాలిగదా!

చి॥ లక్ష్మికి, మీకు వ్రాసిన జాబు చేరియుంటుందనే తలుస్తాను. అప్పుడు నీకు వ్రాసిన issues-Donor names, Addresses, Receipt No. , Amount and Date Deposits పంపవలసినది. అమ్మగారు నీకు ఆశీస్సులని చెప్పమన్నారు. వేదమ్మ నిన్ను తలుస్తూంటుంది. శివరాత్రి సత్సంగంలో గడచినది.

ఇట్లు,
ఆశీస్సులు,
**భరద్వాజ**

### దివ్యజనని అలివేలు మంగమ్మ తల్లి ఆశీస్సులతో

# శ్రీ మంగభరద్వాజ ట్రస్ట్

(Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68)

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మహరాజ్ నిర్దేశించిన స్వచ్ఛమైన, సత్యమైన ఆధ్యాత్మిక జీవనవిధానమును, వారి దివ్యబోధలను, రచనలను ఆధారంగా శ్రీ సాయి మాస్టర్ తత్వ ప్రచార యజ్ఞాన్ని విశ్వవ్యాప్తం చేయటమే ధ్యేయంగా, దివ్యజనని అలివేలుమంగమ్మ ఆశీస్సులతో, గురుకుటుంబం అందించిన ప్రేరణతో శ్రీ మంగభరద్వాజ ట్రస్ట్ ఏర్పరచబడినది. ఈ కార్యక్రమంలో భాగంగా "సాయిబాబా" మాసపత్రిక నిర్వహణ ఇకపై మన "శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్" ఆధ్వర్యంలో కొనసాగుతుంది. శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్ట్ మరియు ఆచార్య భరద్వాజ పీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంకురించిన వివిధ కార్యక్రమాలు (అన్నదానం, ఆశ్రమ నిర్మాణం) ఇకపై మన "శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్" ఆధ్వర్యంలో కొనసాగింపబడుతాయి. శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్ట్, ఆచార్య భరద్వాజ పీస్ ఫౌండేషన్ నిధులను, కార్యక్రమమును వారసత్వంగా స్వీకరించి అన్ని కార్యక్రమములను ఒకే ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడడమేగాక శ్రీ సాయి మాస్టర్, దివ్యజననుల అశీస్సులతో స్థాపించబడిన "శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్" మరిన్ని కార్యక్రమాలతో, క్రమబద్ధంగా, ధర్మబద్ధంగా సాయి మాస్టర్ ప్రచారానికి శాయశక్తులా కృషిచేస్తుంది. ఈ సత్సంకల్పానికి తోడ్పడమని, ఆశీస్సులందించమనీ శ్రీ దత్తునికి, సాయినాధునికి, పాఠకులందరి రూపంలో ఉన్న భగవంతునికీ ప్రార్థన.

ట్రస్ట్ వివరాలను, కార్యక్రమ వివరాలను వచ్చే సంచికలో ప్రచురించి మీముందుంచుతాము. శ్రీ సాయి మాస్టర్ బోధలను, రచనలనూ, వాటి ఆచరణ రూపమైన వారి లీలలను, దివ్యజనని అలివేలు మంగమ్మ, గురుకుటుంబం మనకు అందిస్తున్న అద్భుత జీవన విధానాలనూ సర్వులకూ అందుబాటులో ఉంచాలని, నిజమైన జిజ్ఞాసతో ఆధ్యాత్మిక జీవనాన్ని అవలంబిస్తున్న సాధకులకు సహకారం అందించడానికి, వివిధ మతాల సమైక్యత, సర్వమానవ సౌభ్రాతృత్వము, ధర్మము పునాదులుగా గల రేపటి దివ్య సమాజానికి సాయి మాస్టర్ నిర్మిస్తున్న శాశ్వత ధర్మ సేతు నిర్మాణానికి ఉడతాభక్తిగా మేము చేసుకునే ఈ సేవను పరిపూర్ణం చేయమనీ, మా జీవితాలను ఈ సేవలో సార్థకం చేయమనీ శ్రీ సాయి మాస్టర్‌కు మా హృదయపూర్వక, కృతజ్ఞతాపూర్వక నమస్కారములు.

సదా దివ్యజనని సేవలో

మీ డా॥ జి.వి. రావు, డా॥ ఆర్.ఎస్. శశిధర్, జి. సాయి ప్రసన్న కుమార్

# సాష్టాంగ ప్రణామములు

మాకు పూజ్య మాస్టరుగారి దర్శన భాగ్యం సం॥ 1978లో ఢిల్లీలో కలిగింది. ప్రధమ దర్శనం నించీ ఆయన ఆధ్యాత్మికతను వివరించి చెప్పడంలో అయితేనేమీ, ఆధ్యాత్మికత జీవితంలో ఒక భాగం కాక, అదే ఒక జీవన విధానమని స్పష్టీకరించడంలో నైతేనేమి, Scienceకి, Spiritualityకు ఉన్న నిర్ధిష్టమైన సంబంధాన్ని విశదీకరించడంలోనైతేనేమీ, నన్నేకాక I.I.T Delhiలో ఉన్న Senior Professorలను కూడా సమ్మోహితులని చేసింది వారి ధారణాశక్తి, వాక్పటిమ, వారి వేద విజ్ఞానము, తర్వాత తర్వాత షిర్డీలోను, మళ్ళీ ఢిల్లీలోను, విద్యానగర్‌లోనూ, ఒంగోలులోను, ఆఖరిసారి మళ్ళీ ఢిల్లీలోను ఆయనను దర్శించుకునే అవకాశాన్నిచ్చారు. ఈ సందర్భాలలో సంపూర్ణ జ్ఞాన ధనులైన ఆయన కొన్ని అంశాలు విశదీకరించి మన జీవనాన్ని సాయి మార్గంలో ఎలా నడుపుకోవాలో తెలియచెప్పారు. అప్పటి నుంచి ఆయన నిర్విధికంగా నడుపుతున్న సాయి ప్రచార మార్గంలో ఆసక్తి కలిగినప్పటికి, మేమందరము ఆయన ఆశీర్వాద బలంతోనే ఢిల్లీలాంటి ప్రదేశంలో నెగ్గు కొస్తూ ఉన్నాం. మేము నడుపుతున్న Materialistic Life తోనే (ఇన్ని దశాబ్దాలు) గట్టిగా ముడిపడి ఉండడం జరిగింది. మాస్టరుగారు సమాధి చెందిన తర్వాత కూడా, దివ్యజనని అమ్మగారు, చి॥ ల॥ సౌ॥ వేదవతి, చి॥ ద్వారక బాబుగారు ఒంగోలు నుంచి, తదుపరి హైద్రాబాదు నుంచి నడుపుతున్న ప్రచార కార్యక్రమాల్లో కూడా పాలుపంచుకోవడానికి తీరలేదు.

మాస్టరుగారి అతిసామాన్య జీవనశైలి, నిరంతర బాబా స్మరణ, సమ్మోహనమైన ముఖారవిందం ఎప్పుడు కళ్ళల్లో మెదులుతూ ఉంటాయి. ఆయన దివ్యత్వం ఈనాడు ఆయన వ్రాసిన అనేక సద్గ్రంధాల ద్వారా మనకు లభ్యమవుతుంది. ఇవి ఈనాటి వేదాలు. ఇవి దైవం మానుష రూపేణ అన్న వాక్యాన్ని చరితార్ధం చేస్తాయి. ఈ రచనలో, ఆయన ఉద్బోధలను మనం జుర్రుకోవడమే కాకుండా, వీలైనంత మందికి పంచి పెట్టటం మన కనీస ధర్మం కావాలి. అది మన సేవా సౌభాగ్యం కావాలి.

ఈ దృష్టితో మేము ఢిల్లీ నుంచి వచ్చేసి అమ్మగారిపాదాల దగ్గర చోటుచేసుకుందామనే కోరిక బలీయమై, మేము సం॥ 2007 లో హైద్రాబాదుకి వచ్చేయడం జరిగింది. దీనితో మాకు ప్రతి రోజు అమ్మగారి దివ్య దర్శన భాగ్యం లభిస్తోంది. ఆమె దర్మ బోధ, ధర్మాచరణ సాయి తత్వ విశదీకరణ, మాస్టరుగారి సాయిలీలా స్మరణ చెవులారా, మనసారా ఆనందించే సద్భాగ్యం చేకూరినది. మాకే కాక, నాగోలు వాస్తవ్యులందరికి.

Sai Master సేవలో ఒక ముందడుగుగా, మేము దివ్యజనని అమ్మగారు, ద్వారక బాబు గారల ఆశీర్వాదంతో స్థాపించిన Sai Master Geoenvironmental Services అనే కంపెనీలో ఒక భాగంగా సాయిప్రచార కార్యక్రమాలు ఉడతా భక్తిగా చేపట్టాము.

మాస్టరు గారు భౌతికంగా మనమధ్యన ఉన్నపుడు స్థాపించి, నడిపించిన సంస్థలు/కార్యక్రమాలు సాయిబాబా పత్రిక, శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్, తర్వాత వచ్చిన వేరే వేరే Trust, కార్యక్రమాలు అన్నీ కూడా ఇప్పుడు Sri MangaBharadwaja Trust, Hyderabad ద్వారా నడుపబడతాయని నిశ్చయమైంది. లౌకికంగా చూస్తే,

1. ఇలా అన్నీ ఒక ధ్వజం క్రింద ఉంటే Administrationగా సులభమవుతుంది.
2. వీటికి సంబంధించిన అకౌంట్లు, Audits, Government వారి నిబంధనలు అన్నీ జాగ్రత్తగా చూసుకోవడానికి సావకాశంగా ఉంటుంది.
3. ఇంతే కాకుండా ప్రచార కార్యక్రమాలు ఇంక ఒక యజ్ఞంలా స్వీకరించి, దేశవిదేశాలలో వెదజల్లే

సౌలభ్యం ఎక్కువవుతుంది.

మీదు మిక్కిలి మన ప్రేమ మూర్తులు, సాయి స్వరూపులు అయిన దివ్యజనని అమ్మగారు, భరద్వాజ మాష్టారి ఆధ్యాత్మిక వారసులైన ద్వారక బాబుగారు మనందరికి మాష్టారు అందించిన సాయి లీలామృతాన్ని, సాయి ప్రభోధామృతాన్ని మనకు విశదీకరించి ఆ అమృత భాండారాన్ని పంచడానికి సావకాశం ఎక్కువగా ఉంటుంది.

శ్రీ మంగ భరద్వాజ ట్రస్టు ద్వారా ఈ సాయి, సాయిమాష్టారు సేవను ద్విగుణీకృతం చేసి మా కోరిక మీద ఈ సేవల మహదవకాశం ప్రసాదిస్తున్న దివ్యజనని అమ్మగారికి, చి॥ ల॥ సౌ॥ వేదవతి గారికి, చి॥ ద్వారకబాబు గారికి సాష్టాంగ ప్రణామములు. ఈ అవకాశం మా జీవితానికి ఒక నావ, ఒక ఆలంబన సాయి సేవలో ప్రాప్తిస్తున్నది. ఈ సేవను మాస్టరుగారి దివ్య స్మరణలో సాయి పధంలో నడపించడానికి రధసారధులు వీరే. మేము వేసే ప్రతి అడుగు తప్పటడుగే. మమ్మల్ని దారి తప్పకుండా మార్గం సుగమం చేసి మాష్టారు గారికి మరింత దగ్గరగా చేర్చమని మనసారా అర్థిస్తూ...

డా॥ జి.వి.రావు

---

జై సాయి మాస్టర్ !

అమ్మగారి తొలి దర్శనం 1998 వ సంవత్సరం ఒంగోలులో జరిగింది. అదే నా మొదటి గురు కుటుంబ దర్శనం. కాని దాని అంకురార్పణ, నాకు తెల్సి 1994 లో జరిగింది అనుకుంటున్నాను. నేను పిహెచ్. డి. కి మద్రాసులో చేరడం. మొదటి సంవత్సరం గడిచినా, సరియైన దారి దొరక్కపోవడం జరగడంతో, మొదటిసారి శిరిడీ గడ్డ మీద అడుగు పెట్టే అదృష్టం కల్గింది. రాత్రి 10 గం॥లకు జరిగిన దివ్య దర్శనం అనంతరం, రాత్రంతా సమాధి మందిరం ముందు కూర్చొని, తెల్లవారుఝామున ఆరతి చేయడం ఒక మర్చిపోని సంఘటన. అది మొదలు, నేటి వరకూ జీవితమే ఒక అనుభవం అన్నమాట, తెలియకనే తెలుస్తుంది.

శిరిడీ సాయినాధుని గాణ్గాపూర్‌లో స్వామివారి పల్లకీ మోసే భాగ్యం, సన్నిధానం, వెంకయ్య స్వామివారిని మోసే భాగ్యం. నెల్లూరి దరిదాపుల్లోకి వెళ్లిన ప్రతిసారి విద్యానగర్ దర్శనం. వెంకయ్యస్వామి గారి దర్శనం ఇత్యాదులు ఒక ఎత్తు అయితే, అమ్మగారికీ వారి కుటుంబానికీ కొద్దిపాటి సేవచేసే భాగ్యం ఒక ఎత్తు. 33 ఎళ్ళు గడిపిన జీవితం ఆ తదుపరి జీవితంలో బేరీజు వేసుకుంటే, గురు కుటుంబం దరిదాపుల్లో వుంటే వారి ప్రభావంతో జీవితంలో ఎంత మార్పు తెస్తుందో, జీవితం సార్ధకమవటానికి గల అవకాశాలు ఉపయోగించుకొనే ధైర్యం ఎలా వస్తుందో స్పష్టంగా తెలుస్తుంది.

అమ్మగారి సందేశాలు, సన్నిధానం, స్వామిజీ విశేషించి బాబుగారు ఈ మార్పుకు బాగా దోహద పడ్డారు. నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు చేసిన పూజలు, నోములు, నా తండ్రిగారి గ్రంధ పాండిత్యం పుట్టుకతో వేసిన విత్తనాలైతే, అత్త మామలు, ఆ కుటుంబం చేసే నిస్వార్ధ కార్యాలు ఆ మొక్కలు వృక్షాలు కావటానికి దోహదపడ్డాయి.

అమ్మగారి కుటుంబానికి సన్నిహితంగా ఉండేవారు తప్పక చూడగలిగే విషయం వారు చూపించే అన్నిర్వచనమైన ప్రేమ, దయ, కరుణ, ఆప్యాయత ఎనాటికైనా కొంతైన అది అలవడటానికి వారు వర్షించే

అనంతమైన జ్ఞాన సందేశాన్ని వినటానికి వీలుగా జీవితాన్ని మార్చుకోవాలని చేసిన మొదటి ప్రయత్నం SAGES. కావల్సినదాని వరకు పాటు పడుతూ మిగతా సమయాన్ని ఆ కుటుంబ సేవలో వినియోగించాలని చేసే రెండో ప్రయత్నం Sri Manga Bharadwaja Trust. దీని ద్వారా మనకు తెల్సిన విషయాన్ని అమలు పరుస్తూ అమ్మగారు, బాబుగారు, వేదమ్మగారు చెప్పే ఆధ్యాత్మిక ప్రచారానికి సహాయ సహకారాలు అందిస్తూ మా వంతు కృషిగా దత్తావతారులైన శ్రీ సాయి బోధనలునూ, మాస్టార్‌గారి దివ్య గ్రంథాలను నలుదిక్కులా లభ్యమయ్యే దిశగా పాటు పడాలన్నదే ఈ చిన్ని ఆశయం.

సాయి మాష్టార్ ప్రతి రూపాలై దిశ నిర్ధేశించే మార్గదర్శకులుగా అమ్మగారు, బాబుగారు, వేదమ్మగార్లు ఎన్నడూ మా వెంటే ఉంటూ ఈ చిన్న ఆశయ సాధనకు ఆశీస్సులు, సాధించే శక్తి, ధైర్యం ప్రసాదించమని వేడుకుంటూ...

-డా॥ ఆర్.ఎస్. శశిధర్

---

# సాయి మాస్టర్ కృపకై ప్రార్ధన

**-జి. సాయి ప్రసన్న కుమార్**

ద్వారకనాధ్ గారితో పరిచయం వలన, వారి సాంగత్యం వలన ఆధ్యాత్మికత గురించి కొంతైనా తెలుసుకో గలిగే మహద్భాగ్యం కలిగిన నేను, అసలైన ఆధ్యాత్మికతను శ్రీ సాయి మాస్టర్ బోధలలోనూ, దాని ఆచరణను దివ్యజనని అలివేలు మంగమ్మ లోనూ నా శక్తి మేరకు దర్శించే భాగ్యం పొందటం నిజంగా శ్రీ సాయినాధుని కృప. నిరంతరం ద్వారకనాధ్ గారితో జరిగే సత్సంగం వలన ఇంతటి అద్భుత విజ్ఞానాన్ని సకలజనులకూ అందించాలన్న వారి సత్సంకల్పాన్ని, తపనను చూసిన నాకు ఇప్పుడు వారి ఆశయాలను “శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్” ద్వారా సహకరించే మహద్భాగ్యం లభించిందంటే అది గురుకుటుంబం కృపే గానీ నా సామర్ధ్యం కాదు. మానవుడు ఎలాంటివాడో మనందరికీ తెలుసు. నేనూ సగటు మానవుడనే కనుక తెలిసో తేలియకో తప్పులు దొర్లటం సహజం. అయినప్పటికీ నా శాయశక్తులా భరద్వాజ మహరాజ్‌ను సేవించుకునేలా ప్రయత్నం చేయాలన్నది నా ఆశయం. అది సఫలం అవ్వాలంటే మాత్రం దివ్యజనని చల్లని దీవెన, గురుకుటుంబంతో సాంగత్యము, వారందరి కృప, మార్గనిర్దేశకత్వము నాకు అవసరం. అట్టిది ప్రసాదించమని వారికి ప్రార్ధన. శ్రీ సాయి మాస్టర్‌ల గురించి విన్న ప్రతి భక్తుడూ ధన్యుడు. అంతటి సద్గురువును అనుసరించాలన్న తపన కలిగిన ప్రతివ్యక్తీ వారి కృపకు చిహ్నము. అట్టి మహాశయులైన సాయి మాస్టర్ భక్తులందరూ నా యీ ప్రయత్నంలో సహకరించాలని, నన్ను ఆశీర్వదించాలనీ ప్రార్ధన. “ ఎవరు ఏమి చేసినా, ఏమీ చేయకున్నా శ్రీ సాయి మాస్టర్ ధర్మ యజ్ఞం ఆగేదికాదు. మనం ఆ యజ్ఞంలో వారాశించినట్లు కృషిచేస్తే మనకు సార్ధకత. లేకుంటే మన కర్మ.” అన్న ద్వారకనాధ్ గారి వాక్యాలు నాకు నిరంతరం గుర్తుండి మార్గనిర్దేశకత్వం చేసే చుక్కానిగా నిలవాలని, “శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్” ద్వారా నాకు లభించిన ఈ మహద్భాగ్యాన్ని సద్వినియోగం చేసుకోగలగాలని. వారాశించినట్లు నేను సాయిమాస్టర్‌లను సేవించుకోగలిగేలా అనుగ్రహించమని శ్రీ సాయి మాస్టర్, దివ్యజనని అలివేలుమంగమ్మలకు ప్రార్ధన.

జై సాయి మాస్టర్!

# శ్రీ సాయిబాబా జన్మ రహస్యం!

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

శ్రీ సాయిబాబా శిరిడీలో సుమారు 16 సం॥ల యువకుడుగా వేపచెట్టు క్రింద మొదట 1854 ప్రాంతంలో ప్రకటమైనట్లు వారి చరిత్ర తెల్పుతుంది. తర్వాత ఆయన సుమారు 56 సం॥లు శిరిడీలోనే స్థిరంగా వున్నాకూడా వారినుండి సన్నిహితులైన మహల్సాపతి, శ్యామా, అబ్దుల్లా మొదలైన భక్తులెవరూ గూడా ఇదమిద్ధ మని నిస్సంశయమైన వారి జన్మ వివరాలను సేకరించలేకపోయారు. వారి కులము, మతము, జన్మతేది, జన్మ స్థానము–అన్నీ అనిశ్చితంగానే ఉండిపోయాయి. తర్వాత కీ॥శే॥ బి.వి.నరసింహస్వామిజీ వంటి వారెందరో ఆ వివరణలకై పరిశోధించారు గాని, వారుకూడా ఏమీ నిర్ధారణ చేయలేకపోయారు. ఈ యత్నాల గూర్చి తెలుసుకోవటం పాఠకులకాసక్తికరంగా వుంటుంది.

ఈ విషయమై మొట్టమొదటి సూచన మహల్సాపతికి ఆపాదించబడినది. ఆయన స్వర్గస్థులయ్యాక వారింట్లో చిన్న పుస్తకములో పెన్సిలుతో ఒక పుటలో ఒకమూల జిలుగుగా, "సాయిబాబా పత్రి గ్రామంలో జన్మించారు" అని వ్రాసియున్నదని చెబుతారు. అయితే ఆవివరం మహల్సాపతికెలా లభించిందో ఏమీ సూచించబడలేదట. ఈ విషయమై కీ॥శే॥ వేమూరివెంకటేశ్వర్లుగారు మహల్సాపతికసలు వ్రాయను చేతకాదని, కనుక అదివారు వ్రాసినది కాజాలదనీ వ్రాశారు.

శ్రీ సాయి తాము సేలూ నుండి వచ్చామని, తమ గురువు వెంకూసా అని కొందరితో అన్నారు. రెండవ విషయమైతే ధూలియా కోర్టు నుండి వచ్చిన న్యాయవాదితో స్పష్టంగా చెప్పారు. ఈ విషయమై దాసగణు అను భక్తుడు పరిశోధించయత్నించాడు. తర్వాత అతడు తన కీర్తనలలో సాయి మొదట పత్రి గ్రామంలో జన్మించారనీ, బాల్యంలోనే తల్లిదండ్రులాయనను ఒక ఫకీరు కప్పగించారని, ఆయన కొంతకాలం తర్వాత ఆ బాల ఫకీరును సేలూలో నివసించిన ప్రఖ్యాత వెంకటేశ్వరస్వామి భక్తుడు, జమీందారు, సిద్ధపురుషుడూ అయిన శ్రీ గోపాల్రావ్ దేశ్‌ముఖ్‌కు వప్ప చెప్పాడనీ వ్రాశారు. బాలఫకీరు పట్ల ఆ గురువుకు గల అనుగ్రహానికి సాటిశిష్యులసూయ చెంది అతణ్ణి చంప యత్నించారని, ఆ యత్నంలో వారు విసరిన ఇటుక వెంకూసాకు తగిలిందని. వారు బాల సాయిని శిరిడీకి వెళ్ళి పొమ్మని చెప్పి శరీరం చాలించారనీ వ్రాశారు. ఈ కథనే శ్రీ బి.వి. నరసింహస్వామి తమ "సాయిబాబా జీవిత చరిత్ర" మొదటి భాగంలో వ్రాశారు. నాటి నుండీ యీ కథ విస్తారంగా వ్యాప్తిచెందినది. కాని శ్రీ బి.వి. నరసింహస్వామి గారు శ్రీ సాయిని ప్రత్యక్షంగా సేవించిన భక్తుల అనుభవాలను సేకరించి గ్రంథంగా ప్రచురించారు. అందులో దాసగణు యిలా వ్రాశారు –

"నేను అన్నింటికంటే చివర 'భక్తి సారామృతము' వ్రాశాను. అందులో 52, 53 అధ్యాయాలలో బాబాగూర్చి వ్రాశాను. వాటిని రచించి బాబా ముందుంచగా ఆయన 'బాగుంది' అన్నారు. మిగిలిన అధ్యాయాలు అప్పుడప్పుడు ఎక్కువ భాగం 1918 తర్వాత వ్రాశాను. సం॥ 1925 లో ఆ గ్రంథం సమగ్రంగా ముద్రించబడింది.

"బాబా యొక్క పూర్వ వృత్తాంతానికి చెందిన వివరాలు (28వ అధ్యాయంలో) – సేలూకు సంబంధించినది – కొంతవరకూ బాబా మాటలమీద. కొంతవరకూ సేలూ గ్రామస్తులు చెప్పిన దానిమీద, ఆధారపడి వ్రాశాను. సేలూగూర్చి బాబా చెప్పినదల్లా తాము సేలూ నుండి వచ్చామని మాత్రమే. నేను పోలీసు శాఖలో పని చేస్తూండగా సేలూకు వివరాలను సేకరించడానికి వెళ్ళనారంభించారు. నాకు ఫలాన వివరం ఫలాన సేలూ గ్రామస్థుడు చెప్పాడని వివరించలేను. నేను విచారించి 35 సం॥లకు పైనే అయినది. సుమారు 100 సం॥ల క్రితం ఒక వృద్ధుడైన మహనీయునిలా గ్రామంలో ఉండేవారని, వారివద్దకొక ఫకీరు వచ్చారని, ఆయన బాల్యంనుండీ ఆ మహనీయునివద్ద శిక్షణ పొందుతూండేవారని, కొందరికి ఆ మహనీయుని మీద కష్టంగల్గి ఆయనపై రాళ్ళు రువ్వించంపాలనీ, ఆ బాలఫకీరు తప్పించుకొన్నాడని సేలూ గ్రామస్థులు చెప్పారు. నా యెదుట చందోర్కర్‌తో తమవద్దనున్న ఇటుక తన గురువిచ్చినదని, ఆ గురువు వెంకుసా అనీ సాయి చెప్పారు." అంటే మిగిలినదంతా తమ కల్పనమాత్రమేనని దాసగణు వ్రాశారు. అంతేగాక సేలూకు సంబంధించిన వివరం దాస్‌గణు బాబా మహాసమాధి అనంతరం వ్రాసిన 28వ అధ్యాయంలోనే వ్రాశారు. బాబా ఆమోదముద్ర పొందిన (52, 53) అధ్యాయాలలో పత్రి సేలూల వివరణలేదు.

దాసగణు సేలూలో విచారించినది 1901 లో, అంతకు 100 సం॥లకు ముందు అంటే 1801 ప్రాంతంలో ఆ వృద్ధ మహనీయుడు సిద్ధిపొందివుండాలి. ఆ కథే వాస్తవమైతే శిరిడీ చేరేనాటికి సాయివయస్సు 50 సం॥లకు పైన వుండాలి! కనుక ఎలా చూచిన సేలూకథ వాస్తవమనడానికి వీలులేదు. అయితే సాయి పత్రినుండి 'వచ్చామనడానికి' కొంచెం బలం చేకూర్చే ఆధారం యిటీవల నాకు లభించింది.

శ్రీ సాయిబాబాను ప్రత్యక్షంగా సేవించిన భక్తుడు దామోదర్ రాస్నే గారి నాల్గవకుమారుడు నానాసాహెబ్ సుమారు 20 సం॥లు సాయిని ప్రత్యక్షంగా సేవించారు. వీరు శిరిడీలో నున్నారు. నాతో వీరు చెప్పారు : "గాడ్గేమహరాజ్ అను మహనీయుడొకసారి మాయింటికొచ్చారు. వారికంతటి పూర్ణ జ్ఞానమెలా కలిగిందని అడుగగా తమ వృత్తాంతం చెప్పారు. మొదట వారు శివగావ్ పథరీ అనే గ్రామంలో ఒక బట్టలదుకాణంలో గుమస్తాగా పనిచేస్తూండగా ఒకరోజు ఒక దివ్య వర్చస్సుగల ముస్లింఫకీరు భిక్ష కోసం వచ్చారు. మతద్వేషంవలన అయనకెవరూ భిక్ష వేయలేదు. ఆయనకి ఏలాగైనా భిక్షవేయాలని తలచి యిలా వచ్చాను. ఆరోజు శెలవుతీసుకొని యింటికి వెళ్ళి రొట్టెలు, ఉల్లిపాయ తీసుకొని వచ్చాను. అప్పటికే ఊరుదాటి ఒక పొలంలో జొన్నకంకులు కోసుకుని ఆ ఫకీరు నిర్జన ప్రదేశంలో కూర్చొని తింటున్నారు. ఈ గుమాస్తాని చూస్తూనే ఎందుకొచ్చావ్?" అని గద్దించారు.

"ఎవరూ భిక్ష యివ్వలేదని మీ కోసం భిక్ష తెచ్చాను." "అయితే ఏది కోరితే అదిస్తావా?" నా దగ్గర లేనిది తప్ప ఏదైనా కోరనా, ప్రాణాన్నైనాసరే! నావద్దనున్నదిస్తాను!

"అయితే నీ జీవితాన్నిచ్చెయ్యి!"

"తీసుకోండి, నాకిప్పటికే జీవితమంటే విసుగెత్తింది. అది నేను తీసియివ్వగల వస్తువుకాదుగా!"

ఆ ఫకీరు గుమస్తా శిరస్సుపైన ఆశీర్వచనపూర్వకంగా తమ హస్తాన్నుంచారు. తక్షణమే అతడు ఆత్మానందంలో బాహ్యస్మృతి కోల్పోయాడు. స్పృహ కలుగగానే అతడు త్వరత్వరగా తన దుకాణానికీ, యింటికీవెళ్ళి తన వాళ్ళందరితో తనకు ఋణం తీరిపోయిందని చెప్పి సర్వబంధాలూ వీడి తిరిగి తన గురువును చేరేసమయానికి ఆ ఫకీరు చాలాదూరం వెళ్ళారు. అతణ్ణిచూచి, "ఎందుకు మళ్ళీ నన్ను వేధించడానికొచ్చావ్?" అని గద్దించారు ఫకీరు. "మిమ్ము విడచి జీవించలేను" అన్నాడా శిష్యుడు. అతణ్ణి ఒక మహనీయుని సమాధివద్దకు తీసుకెళ్ళి దాని సమీపాన ఒక గుంటతవ్వించి, రెండు కుండలనీరు అందులో పోయించి, అందులోని నీరు తాము ముమ్మారు ఆచమించి, ఆ శిష్యునిచేగూడ అలానే చేయించారు. అతడు మరలా తన్మయత్వం చెందాడు. అతడికి బాహ్యస్పృహకల్గేసరికి ఫకీరక్కడలేరు! మనోవేగంతో మరుక్షణమే ఆయన శిరిడీ చేరినట్లు శిష్యుడు తర్వాత తెలుసుకున్నాడు. అతడు అక్కడక్కడా ఆయనకోసం వెదుకుతూ శిరిడీచేరాడు. అక్కడొక వింత ఫకీరున్నారని తెలిసి మసీదుకు చేరాడు. లోపల తెరలుదించి వున్నాయి. ఆ సాధువు తెరతొలగించి చూచాడు. ఆ లోపలున్నది తన గురువే! అయితేనేమీ! ఆఫకీరు ఉగ్రులై "దొంగ వెధవా, నా రక్తమాంసాలు పీక్కుతిన్నది చాలక ఎముకలుగూడా తిందామని వచ్చావా? నీకివ్వవలసినదంతా యిచ్చినా గూడా యింకా నన్ను పీడించనువచ్చావెందుకు? పో!" అని గర్దించి ఒక ఇటుక అతనిమీదకు విసరారు. అది అతడి భృకుటికి తగిలి అర్ధచంద్రాకారంగల గాయమైంది. "నిన్ను నావెంట రావద్దన్నాను. నీకు పూర్ణానుగ్రహమిచ్చాను. నిన్ను దైవంగా కొలుస్తారు. దైవకృప నీకెల్లప్పుడూ ఉంటుంది" అన్నారు.

ఈ వృత్తాంతం ప్రకారం సాయి తాము పథరీ (పత్రి) గ్రామంనుండి శిరిడీ వచ్చామనడం సమంజసమే. కాని ఆయనక్కడ జన్మించారనడానికి యీ ఆధారం చాలదు. అక్కడికాయన దేశాటనంలో వచ్చారు. అంతే!

శ్రీ సాయి పూర్వ వృత్తాంతము, జననాది విశేషాలను గురించి వారి పూర్ణ ఆశీస్సులతో, అనుమతితో వ్రాయబడిన "శ్రీసాయి సచ్చరిత్ర" అన్న ఆది గ్రంథంలో రచయిత, ప్రత్యక్ష సాయిభక్తుడూ అయిన అన్నాసాహెబ్ దభోల్కర్ యిలా వ్రాశారు :

"సాయిబాబా తల్లిదండ్రుల గూర్చిగాని, వారి వ్యవస్థానమును గూర్చిగాని యెవరికీ యేమీ తెలియదు. అనేకసార్లు భక్తులు కనుగొనుటకు ప్రయత్నించిరి. అనేక సార్లు యీ విషయమును గూర్చి బాబాను ప్రశ్నించారుగాని వారినుండి యెట్టి సమాధానమునుగాని, సమాచారమునుగాని పొందకుండిరి."

---

## సాయిబాబా పాఠకులకు మనవి

www.saibharadwaja.org, www.saimasterforums.com వెబ్‌సైట్‌లను maintenance నిమిత్తం తాత్కాలికంగా నిలిపివేయటమైనది. అతి త్వరలో ఆ వెబ్‌సైట్‌లు సాయి మాస్టర్ ప్రచార యజ్ఞంలో తిరిగి పాల్గొంటాయని మనవి.

# Statement about ownership and other particulars of SAI BABA (Monthly) FORM - IV (See Rules 8)

1. Name of the Publication : SAIBABA
2. Periodicity of its publication : MONTHLY
3. Printer's Name : P.Srinivasa Rao
   Nationality : Indian
   Address : Sri Manga Bharadwaja Trust, Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad -68
4. Publisher's Name : P.Srinivasa Rao
   Nationality : Indian
   Address : Sri Manga Bharadwaja Trust, Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad -68bb
5. Editor's Name : P.Srinivasa Rao
   Nationality : Indian
   Address : Sri Manga Bharadwaja Trust, Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
6. Name and Address of individuals who own the News papers and Shareholders holding more than 1% of the total capital : Advisory Member of Sri Manga Bharadwaja Trust

I, P.Srinivasa Rao, hereby declare that the particulars given above are true the best of my knowledge and belief.

Ongole
1-5-2010

(Sd.)P.Srinivasa Rao
Signature of Publisher

జై సాయి మాస్టర్ !!

ప్రియ గురు బంధువులారా! జగద్గురు శ్రీ సాయిమాస్టర్ ఆధ్యాత్మిక సేవలనందించడానికి, దివ్యజనని అలివేలుమంగమ్మ భరద్వాజుల ఆశీస్సులతో 'శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్' స్థాపించబడినది. సాయిమాస్టర్ భక్తులు, జిజ్ఞాసువులు–పుస్తకములు, ఫోటోలు మొదలగు వాటికొరకుగాని, విరాళములు మరియు Magazine Subscriptions మొదలగు అన్ని విషయములకు ఇకనుండి ఈ క్రింది అడ్రసును సంప్రదించగలరు. D.D.లు, M.O.లు కూడా ఈ క్రింది అడ్రసుకు పంపించగలరు.

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : 040-20063300

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 200-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 70-00 |
| శ్రీ గురు చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి సన్నిధి | 75-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 75-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 40-00 |
| సాయినాథ పూజ | 20-00 |
| సాయినాథ స్థవనమంజరి | 5-00 |
| శిరిడీ ఆరతులు | 6-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 5-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | 10-00 |
| విజ్ఞాన వీచికలు | 40-00 |
| పరిప్రశ్న | 35-00 |
| మతమెందుకు? | 20-00 |
| ఏది నిజం? | 25-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 33-00 |
| బుద్ధధ్యాన హృదయం | 20-00 |
| దత్తావతార మహత్మ్యం | 30-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 80-00 |
| పురుషసూక్త రహస్యం | 20-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 5-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 45-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 15-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 40-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 20-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 40-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 25-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 30-00 |

## ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 55-00 |
| అవధూత చివటం అమ్మ | 35-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 30-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 75-00 |
| మరో నందదీపం | 55-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 125-00 |
| గురుశుశ్రూష | 199-00 |

## BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | 110-00 |
| Guru Charitra | 50-00 |
| Supreme Master (Swami Samartha) | 50-00 |
| Sai Baba and His Teachings | 60-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 25-00 |

## BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 100-00 |
| Sai Leelamrutham (Kannada) | 80-00 |
| Sai Baba Jeevitha Charitham (Malayalam) | 90-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 80-00 |
| Sri Guru Charitra (Hindi) | 50-00 |
| Sri Guru Chraitra (Kannada) | 99-00 |
| Shirdi Arathi (Tamil) | 6-00 |

SRI GURUPADUKA PUBLICATIONS
MangaMoor Road, Ongole-2, Ph: 08592-233271
www.saibharadwaja.org
www.saimasterforums.com